
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 29.0
కనిష్ఠం 23.4
**



సూర్యాపేట

5

ఆదివారం 19 అక్టోబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	588.70 (308.1702)	53,035	53,035
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.40 (4.30)	2,034.36	1,663.85
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.882 (44.0352)	30,548	37,760

చికెన్ ధరలు | లైవ్ : రూ.145 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250



దరఖాస్తులు అందజేస్తున్న వ్యాపారులు

జిల్లాలో మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు వ్యాపారులు ఈ పర్యాయం పెద్దగా ఆసక్తి చూపించలేదు. గతంలో మాదిరే దరఖాస్తులతో ఆదాయాన్ని రాబట్టుకునేందుకు దరఖాస్తు ఖరీదును రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచింది. అయితే 2023లో 4,388 దరఖాస్తులు రాగా ఈ పర్యాయం 2,617 దరఖాస్తులు వచ్చాయి. గతంలో కన్నా 1,771 దరఖాస్తులు తక్కువగా వచ్చాయి. అదేవిధంగా గతంలో దరఖాస్తులతో రూ.87.76 కోట్ల ఆదాయం రాగా ఈ సారి రూ.78.51 కోట్లు వచ్చింది. గతంలో కన్నా రూ.9.25 కోట్ల ఆదాయం తగ్గింది.

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట (క్రైం)

ఆసక్తి తగ్గింది

- ముగిసిన మద్యం దుకాణాల టెండర్ల దాఖలు
- ఆశించిన మేర ముందుకురాని వ్యాపారులు
- జిల్లాలో ప్రస్తుతం 93 మద్యం దుకాణాలు
- గతంలో 4,388 దరఖాస్తులు రాగా ఈ సారి 2617లకే పరిమితం
- ఈ నెల 23న దుకాణాల కేటాయింపునకు లక్కీడ్రా



జిల్లాలోని 99 మద్యం దుకాణాలు ఉండగా సరైన విక్రయాలు లేని కారణంతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి జిల్లా సరిహద్దులో ఉన్న ఆరు దుకాణాలతో పాటు చిలుకూరు మండలంలోని ఒక దుకాణాన్ని ఈసారి నోటిఫికేషన్‌లో తొలగించారు. సూర్యాపేట ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలోని ఆత్మకూర్(ఎస్) మండలంలో ప్రస్తుతం ఉన్న దుకాణాలకు అదనంగా మరో దుకాణాన్ని ఏర్పాటు చేశారు. దీంతో మొత్తం 93 దుకాణాలకు 40 దుకాణాలు రిజర్వేషన్ కాగా మిగిలిన 53 దుకాణాలు జనరల్‌కు కేటాయించారు. మూడు ఎస్టీలకు, 10 ఎస్సీలకు, 27 గౌడ కులస్తులకు కేటాయించారు. దుకాణాల కేటాయింపులకు పాత నిబంధనలనే వర్తింపజేశారు. లైసెన్స్ ఫీజులను గతంలో మాదిరే ఆరు స్లాబుల్లో చెల్లించే నిబంధనలను, అంతేకాకుండా లైసెన్స్ కాలపరిమితి కూడా రెండేళ్లు అలానే కొనసాగించారు.

ముందస్తు ఆదాయం కోసం

బీఆర్ఎస్ ప్రభుత్వం 2023లో ముందస్తుగా మద్యం దుకాణాలకు టెండర్లు నిర్వహించి ఆదాయాన్ని సమకూర్చుకుంది. ఆగస్టు 21 దుకాణాలకు లక్కీ డ్రా తీయగా, అనంతరం డిసెంబరు ఒకటో తేదీ నుంచి దుకాణాల ప్రారంభించారు. ఈసారి కూడా ముందుగా ఈ ఏడాది సెప్టెంబరు 25 నుంచి ఈ నెల 18 వరకు దరఖాస్తులు స్వీకరించారు. ఈ నెల 23న డ్రా తీసి మద్యం దుకాణాలను కేటాయించనున్నారు. 2023లో జిల్లావ్యాప్తంగా 99 మద్యం దుకాణాలకు 4,388 దరఖాస్తులు వచ్చాయి. ఈసారి 93 దుకాణాలకు గాను 2,617 దరఖాస్తులు వచ్చాయి

ముందుకు రాని వ్యాపారులు

ఈ సారి మద్యం దుకాణాలకు దరఖాస్తులు చేసేందుకు వ్యాపారులు ముందుకు రాలేదు. ఒక్కో దరఖాస్తు ఫీజును రూ.3 లక్షలు చేయడంతో వ్యాపారులు తక్కువ మొత్తంలో దరఖాస్తు చేశారు. దీనికి తోడు లైసెన్సు ఫీజు చెల్లించి రెండు నెలలు వేచిఉండాల్సి రావడంతో ఆయా డబ్బుకు వడ్డీ భారం తప్పడం లేదు. ప్రభుత్వం మద్యం వ్యాపారులకు ఇచ్చే లాభాలు మాత్రం పెంచలేదు. దీంతో దరఖాస్తు చేసేందుకు వ్యాపారులు పెద్దగా ఆసక్తి చూపలేదు. కొంతమంది మాత్రం సిండికేట్‌గా ఏర్పడి విడివిడిగా కాకుండా గ్రూపులుగా మద్యం దుకాణాలకు టెండర్లు దాఖలు చేశారు. దసరా పండుగ తర్వాత నుంచి దరఖాస్తులు చేసేందుకు ఆసక్తి చూపారు. అంతేకాకుండా ఇటీవల ఈ నెల 9న ఎన్నికల నోటిఫికేషన్ కూడా ఉండడం, కోర్టు తీర్పు ఈనెల 8న ఉండడంతో అవి ముగిసిన అనంతరం దరఖాస్తులు...

-మిగతా 8వ పేజీలో...

రూటు మారిన ఇసుక దందా

- అనుమతులు ఒక చోటకి, తరలించేది మరోచోటకు
- ఒకే వేబిల్‌తో రెండు నుంచి మూడు ట్రిప్పులు



మోతె పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుబడిన ఇసుక లారీలు(ఫైల్)

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించడం లేదు. ప్రభుత్వ నిఘాను దాటి వ్యాపారులు అనేక అక్రమమార్గాలను ఎంచుకుంటున్నారు. జిల్లాలో పలు చోట్ల ప్రభుత్వం జారీ చేసే వేబిల్ మాటున అనుమతులు పొందిన ప్రాంతం కాకుండా ఇతర ప్రాంతాలకు ఇసుకను తరలిస్తున్నారు. పోలీసులు, మైనింగ్ అధికారులు తనిఖీలు చేసినప్పుడు పట్టుబడితే కేసులు నమోదవుతున్నాయి. లేదంటే యథేచ్ఛగా అక్రమ మార్గంలో ఇసుక తరలిపోతోంది.

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట క్రైం)

ఇసుకఅక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇసుక రీచ్‌లను ఏర్పాటుచేసింది. దాని ద్వారా ఇసుక అవసరమున్న వారు ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసుకోవచ్చు. ప్రభుత్వానికి సంబంధించిన యాప్ ద్వారా బుక్ చేసుకుంటే నిర్ణీత గడువులోగా బుక్ చేసుకున్న వారి ఇంటికి ఇసుక వాహనాల్లో సరఫరా చేస్తారు. దీంతో జిల్లాలో చాలావరకు ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా తరలించే విధానానికి స్వస్తి పలికారు. అయితే భద్రాద్రి-కొత్తగూడెం, ములుగు జిల్లాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ల ద్వారా లారీల్లో పెద్దఎత్తున హైదరాబాద్‌కు ఇసుకను తరలిస్తున్నారు. అయితే దీనిని ఆసరాగా చేసుకున్న జిల్లాకు చెందిన కొందరు ఇసుక వ్యాపారులు అక్రమ పద్ధతుల్లో జిల్లాతో పాటు హైదరాబాద్‌కు ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

అనుమతి ఒకచోటకు.. రవాణా మరోచోటకు..

ఇసుక అక్రమ రవాణాకు వ్యాపారులు కొత్తదారులు వెతికారు. ప్రభుత్వం నుంచి అనుమతులు ఒక చోటకి పొంది మరోచోటకు తరలిస్తున్నారు. ఇసుక వ్యాపారులు లారీల్లో ఇసుకను తరలించేందుకు ప్రభుత్వం..

-మిగతా 8వ పేజీలో...

సూర్యాపేటలో బంద్ పాక్షికం



నూతనకల్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న బీసీ నాయకులు

సూర్యాపేటటౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనపై హైకోర్టు ఇచ్చిన స్టేను నిరసిస్తూ బీసీ సంఘాల జేఏసీ శనివారం చేపట్టిన బంద్ సూర్యాపేటలో పాక్షికంగా జరిగింది. ఉదయం 4 గంటల నుంచి జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో కార్యాలయం ఎదుట ప్రజాసంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు ధర్నా నిర్వహించారు. బస్సులను డిపో నుంచి వెళ్లకుండా నిరసన తెలిపారు. ఉదయం 10గంటల తర్వాత సూర్యాపేట జిల్లాలో పలు వ్యాపార, వాణిజ్య దుకాణాలు యథావిధిగా తెరిచి తమ వ్యాపారాలు కొనసాగాయి. సూర్యాపేట జిల్లాకేంద్రంలో ఆర్టీసీ పరిధిలో తప్ప మిగతా చోట బంద్ అంతగా కనిపించలేదు. ఈ సందర్భంగా పలువరు మాట్లాడుతూ బీసీలకు 42శాతం రిజర్వేషన్లు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. 42శాతం బీసీ బిల్లును అమోదించాల్సిన బాధ్యత బీజేపీదేనని పేర్కొన్నారు. బీజేపీ ద్వంద వైఖరి అవలంబిస్తోందని ఆరోపించారు.

నేరస్థులకు త్వరగా శిక్షలు పడేలా కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ నర్సింహా

సూర్యాపేట క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : నేరస్తులకు కోర్టుల్లో త్వరగాఆ శిక్షలు పడేలా కోర్టు విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది కృషి చేయాలని ఎస్పీ కొత్తపల్లి నర్సింహా అన్నారు. జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో కోర్టు విధులు నిర్వహించే సిబ్బందితో శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పనిలో నాణ్యత, పారదర్శకత ఉండాలన్నారు. కోర్టు వారెంట్లు, సమన్లు సకాలంలో అందజేయాలన్నారు. పోలీస్ సిబ్బంది సిబ్బంది కోర్టుల్లో సమన్వయంతో ఉంటూ సమయపాలనతో పనిచేయాలన్నారు. ఎప్పటికప్పుడు కేసుల స్థితిగతులను రికార్డులతో పాటు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. బాధితులు, సాక్షులు, నిందితులను సకాలంలో కోర్టుల్లో ప్రవేశపెట్టి కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. నేరస్తులకు శిక్షలు పడినప్పుడే నేరాలు తగ్గుతాయన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీరవి,ఇన్‌స్పెక్టర్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ ఫ్లాగ్‌డే కార్యక్రమలు ..

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో ఈ నెల 21 నుంచి 31వ తేదీ వరకు పోలీస్ ఫ్లాగ్‌డే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ కొత్తపల్లి నర్సింహా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాజ రక్షణలో అమరులైన పోలీసులను స్మరిస్తూ జిల్లావ్యాప్తంగా నిర్వహించే ఫ్లాగ్‌డే కార్యక్రమాల్లో యువత, విద్యార్థులు భాగస్వాములై పోలీసులకు నివాళులు అర్పించాలన్నారు. పోలీసుల విధులు, టెక్నాలజీ ఉపయోగం, ఓపెన్‌హౌజ్ కార్యక్రమం నిర్వహించడంతో పాటు రక్తదాన శిబిరం, అమరుల కుటుంబాలను సందర్శించడం, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. పోలీస్ ప్రతిభ తెలిపే లఘు చిత్రాల పోటీలు, ఫొటోగ్రఫీ పోటీలు ఉంటాయన్నారు. తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో ఆన్‌లైన్‌లో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. డ్రగ్స్ నివారణలో పోలీస్ పాత్ర, విద్యార్థులు డ్రగ్స్ నుంచి ఎలా దూరంగా ఉండగలరు అనే అంశాలపై ఆన్‌లైన్‌లో 500 వ్యాఖ్యాల్లో వ్యాసం రాయాల్సి ఉందన్నారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు. పోటీల్లో హోంగార్డుల నుంచి ఏఎస్ఐ స్థాయి వరకు పాల్గొనాల్సి ఉందన్నారు. అదేవిధంగా పోలీస్ త్యాగాలు అనే అంశంపై 500 పదాల్లో వ్యాసం రాసి ఈ నెల 19వ తేదీ సాయంత్రం వరకు పంపాలన్నారు. మరిన్ని వివరాలకు 7013923377 సెల్‌ఫోన్‌ను సంప్రదించాలన్నారు.

సామిల్ యజమానుల సమస్యల పరిష్కారానికి కృషి



రమణయ్యను సన్మానిస్తున్న సామిల్, టింబర్ డిపో అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు

సూర్యాపేట(కలెక్టరేట్), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా సామిల్, టింబర్ డిపోల యజమానులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు సామిల్ అండ్ టింబర్ డిపో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చకిలం రమణయ్య అన్నారు. శనివారం సూర్యాపేట పట్టణానికి విచ్చేసిన సందర్భంగా పట్టణంలోని అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టింబర్ డిపో యజమానుల సమస్యలను త్వరలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి పాటుపడతామన్నారు.

డింబర్ డిపో యజమానులు ఐక్యంగా సమస్యల సాధనకు కృషి చేయాలన్నారు. అనంతరం రమణయ్యను =సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తౌడోజు సలేంద్రాచారి, ప్రతినిధులు బహురోజు ఉపేంద్రాచారి, కల్లూరి మురళీకృష్ణ, తౌడోజు ఉపేంద్రాచారి, పర్వతం సైదాచారి, తౌడోజు రవీంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

సురేష్ మృతి బీఆర్‌ఎస్‌కు తీరనిలోటు



సంతాపసభలో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

చిలుకూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు దొడ్డా సురేష్ ఆకాల మృతి బీఆర్ఎస్‌కు తీరని లోటని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సురేష్ సంతాప సభలో ఆయన మాట్లాడారు. ఆదర్శ ప్రాయుడు దొడ్డా సురేష్ అన్నారు. మండల వ్యాప్తంగా గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి మరువలేనిదన్నారు. ఆయన ఆశయాసాధనకు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా సురేష్ చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జానకీరామాచారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ పార్టీ నాయకులు, ఉద్యోగ సంఘాల, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కోదాడ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట(కలెక్టరేట్), అక్టోబరు 18, (ఆంధ్రజ్యోతి): కోదాడ మునిసిపాలిటీ అమృత్ 2.0 పథకానికి ఎంపికైనందున పట్టణాభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సంబంధింత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం కోదాడ పట్టణాభివృద్ధిపై వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కోదాడ పట్టణంలో భవిష్యత్‌లో పెరగనున్న జనాభాకనుగుణంగా అన్ని మౌలిక వసతులు కల్పించే విధంగా మాస్టర్‌ప్లాన్ తయారు చేయాలన్నారు. రోడ్లు, డ్రైయినేజీ, తాగునీరు, విద్యావ్యవస్థ, ఇరిగేషన్, విద్యుత్ వ్యవస్థలు అభివృ ద్ధి చెందే విధంగా ప్లాన్ తయారు చేయాలన్నారు. అర్బన్ డెవలప్‌మెంట్ ప్లాన్‌సరిగా లేకుంటే ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కొలనుపాక సీతారామారావు, ఆర్డీవో సూర్యనారాయణ, డీటీసీపీ ప్రాజెక్టు డైరెక్టర్ అశ్విని, కోదాడ మునిసిపల్ కమిషనర్ రమాదేవి, సీపీవో కిషన్, డీఎఫ్‌వో సతీష్‌కుమార్, పరిశ్రమల శాఖ అధికారి సీతారాం నాయక్, మునిసిపల్ డీఈ సాయిలక్ష్మి, టీపీవో ప్రసాద్ ఉన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో చంద్రశేఖర్

మునగాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు ఉంటాయని డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని పీహెచ్‌సీ తనిఖీ చేశారు. గ్రామాల్లో వివిధ రకాల టీకాల నమోదు రికార్డులను పరిశీలించారు. కొక్కిరేణి గ్రామ టీకాల రికార్డు తప్పుల తడకగా ఉండటంతో వైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది విధుల నిర్వహణలో రికార్డుల నమోదులో అలసత్వం వహిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి వైద్య సేవలు అందించాలన్నారు. సేవలతో ప్రజల మన్ననలు పొందినప్పుడే వైద్యశాఖపై నమ్మకం పెరుగుతుందన్నారు. ఆయన వెంట వైద్యాధికారులు రవీందర్, స్రవంతి, వైద్యసిబ్బంది స్వాతి, మానస ఉన్నారు.

మట్టపల్లిలో నిత్య కల్యాణం



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మట్టపల్లి క్షేత్రంలో శివకేశవుల ఆలయాల్లో హరిహరులకు శనివారం విశేష అర్చనలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకాలు, ఆరె పత్రితో అష్టోత్తర నామార్చనలు, ఆర్జిత సేవలు కొనసాగించారు. భక్తుల ఆధ్వర్యంలో వైభవంగా నిత్యకల్యాణం చేపట్టారు. అనంతరం దివ్యమూర్తులను ఆలయ ప్రదక్షిణ చేయించారు. మహిళలు రాజ్యలక్ష్మీ అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు.

భక్తులు కృష్ణానది స్నానాలు ఆచరించి ఈశ్వరుడికి, స్వయంభువుడి అభిషేకాల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం మహర్నివేదనలు తదుపరి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం మహా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, అర్చకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి



పశువైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా సహాయ సంచాలకుడు వెంకన్న

పెన్‌పహాడ్, అక్టోబర్ 18(ఆంధ్రజ్యోతి) : పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పకుండా వేయించాలని రైతులకు జిల్లా సహాయ సంచాలకుడు బీ వెంకన్న సూచించారు. మండలంలోని ధర్మాపురం, పొట్లపహాడ్ గ్రామాల్లో నిర్వహిస్తున్న శిబిరాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. వ్యాధి నివారణ టీకాలతో పశువులు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ వెంకన్న, సిబ్బంది సత్తార్, రవి, గోపాలమిత్రలు, రైతులు తదితరులు ఉన్నారు.

దీపావళి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి



ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

కోదాడటౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : దీపావళి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఎస్ఆర్ఎం విద్యాసంస్థల కరస్పాండెంట్ కేశినేని శ్రీదేవి అన్నారు. స్థానిక బాలాజీనగర్ ఎస్ఆర్ఎం స్కూల్‌లో శనివారం ముందస్తు దీపావళి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా దీపావళి విశిష్టత గురించి ఆమె వివరించారు. తూర్పు భారతదేశంలో కాళికామాత రక్తబీరుని చంపిన సందర్భంగా దీపావళి చేసుకుంటారని ఉత్తర పశ్చిమ భారతదేశంలో రావణుని చంపి శ్రీరాముడు అయోధ్య నగరానికి తిరిగి వచ్చిన సందర్భంగా దీపావళి జరుపుకుంటారని, దక్షిణ భారతదేశంలో సత్యభామ నరకాసురుని చంపి సందర్భాన్ని దీపావళి చేసుకుంటారని ఆమె అన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు

తిరుమలగిరి, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు ప్రకటించినట్లు కార్యదర్శి సురేష్ శనివారం ఓ ప్రకటనలోతెలిపారు. ఆదివారం, సోమవారం దీపావళి, మంగళవారం అమావాస్య సందర్భంగా మార్కెట్‌కు సెలవులు ప్రకటించినట్లు తెలిపారు. బుధవారం మార్కెట్ ప్రారంభమవుతుందని తెలిపారు.

బీసీ బంద్ విజయవంతం


కొండమల్లేపల్లిలో బీసీల ఆధ్వర్యంలో నిరసన



నల్లగొండలో బంద్‌తో మూతబడిన ఎన్‌పీటీ మార్కెట్


మిర్యాలగూడలో ఆర్టీసీ డిపో ఎదుట ఆందోళన


నిర్మానుష్యంగా నల్లగొండలోని క్లాక్‌టవర్ సెంటర్


నల్లగొండలో బైక్‌ర్యాలీలో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌తో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి


నిర్మానుష్యంగా నల్లగొండ బస్టాండ్


మిర్యాలగూడలో ర్యాలీలో బైక్‌పై ఎమ్మెల్యే బీఎల్‌ఆర్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం చేపట్టిన బీసీ బంద్ విజయవంతమైంది. స్థానిక సంస్థల్లో 42 శాతం జీవోను హైకోర్టు కొట్టివేయడాన్ని నిరసిస్తూ అన్ని బీసీ సంఘాలతో పాటు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్, వామపక్షాలతో పాటు వివిధ ప్రజా సంఘాల పిలుపు మేరకు వాణిజ్య, వ్యాపార, విద్యాసంస్థలను మూసివేశారు. ఆయా జిల్లా కేంద్రాలతో పాటు మండల కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించారు. అన్నివర్గాలు బంద్‌లో పాల్గొనడంతో బంద్ విజయవంతమైంది.


మిర్యాలగూడలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ


నకిరేకల్‌లో ర్యాలీలో బైక్‌పై ఎమ్మెల్యే వేముల వీరేశం


భువనగిరిలో బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు


నల్లగొండలోని బస్టాండ్ ఎదుట బీసీల ఆధ్వర్యంలో నిరసన


భువనగిరిలో మూతబడిన వ్యాపార సముదాయాలు


సూర్యాపేట డిపో ఎదుట అన్ని పార్టీల ఆధ్వర్యంలో ధర్నా


సూర్యాపేటలో బైక్ ర్యాలీలో టీఆర్‌పీ నాయకుడు జానయ్యయాదవ్

పర్యాటక పోలీసులు వచ్చేశారు

- పర్యాటకులకు భద్రత కల్పించడం
- పర్యాటకాన్ని ప్రోత్సహించడం లక్ష్యం
- యాదాద్రి భువనగిరికి 15 మంది, నల్లగొండకు 10 మంది


భువనగిరిలో ఖిల్లా సందర్శకులకు జాగ్రత్తలు వివరిస్తున్న పర్యాటక పోలీసులు

(ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్): అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాల్లో పర్యాటక రంగం ఒకటి.చారిత్రక, పురాణ నేపథ్యాలను తెలుసుకోవడానికి విజ్ఞాన, భక్తియాత్రలు, వృత్తిపరమైన ఇతర మానసిక ఒత్తిడిలను అధిగమించేందుకు విహారయాత్రలకు వెళ్తుండటం క్రమేపీ పెరుగుతోంది. విశిష్టత, ప్రాధాన్యత ఆధారంగా పలుప్రదేశాలను సందర్శిస్తున్న దేశీయ, విదేశీ పర్యాటకుల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. అయితే ఆయా ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు పర్యాటకుల భద్రతకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని తెలంగాణ ప్రభుత్వం సంకల్పించింది. పర్యాటకుల భద్రతకు ఏ మాత్రం భంగం వాటిల్లినా సోషల్‌మీడియా ప్రభావంతో స్థానికంగా, దేశంలో చివరికి ప్రపంచ వ్యాప్తంగా స్వల్ప వ్యవధిలోనే సంచలంగా మారే పరిస్థితులు నెలకొన్నాయి. అలాంటి ఘటనలతో ఆయా ప్రదేశాలు అంతిమంగా రాష్ట్ర పర్యాటక ప్రతిష్ఠకు భంగం కలుగుతోంది. ఈ నేపథ్యంలో బహుళ లక్ష్యాలతో ప్రభుత్వం పర్యాటక పోలీసు వ్యవస్థను రూపొందించింది. ఏఆర్ సివిల్ పోలీస్‌ల నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 80మందిని పర్యాటక శాఖకు కేటాయించారు. వీరిని రాష్ట్రంలో పర్యాటకుల సంఖ్య అధికంగా ఉండే ప్రదేశాల్లో నియమించారు. ఈ మేరకు యాదాద్రిభువనగిరి జిల్లాకు 15మంది, నల్లగొండ జిల్లాకు 10మందిని మహిళా, పురుష పోలీసులను కేటాయించగా నిర్దేశిత సందర్శనీయ స్థలాల్లో విధుల్లో చేరారు.

యాదాద్రిభువనగిరికి 15 మంది, నల్లగొండకు 10మంది

యాదాద్రిభువనగిరి జిల్లాకు 15మంది, నల్లగొండ జిల్లాకు 10 మంది పర్యాటక పోలీసులను కేటాయించారు. ఈ మేరకు యాదాద్రిజిల్లాలో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఆరుగురు, పోచంపల్లిలో ఐదుగురు, భువనగిరి ఖిల్లా వద్ద నలుగురు పోలీసులు విధులు నిర్వహించనున్నారు. నల్లగొండ జిల్లాలో బుధవారం నార్త్ విజయపురి ప్రాజెక్ట్ పెద్దవూరలో నలుగురు, ఛాయాసోమేశ్వరస్వామి ఆలయం, పానగల్‌లో ముగ్గురు, చెరువుగట్టు శ్రీపార్వతి జడలరామలింగేశ్వరస్వామి ఆలయంలో ముగ్గురు చొప్పున పర్యాటక పోలీసులు విధులు నిర్వహిస్తారు. వీరందరూ జిల్లా పర్యాటకశాఖ అధికారి పర్యవేక్షణలో విధులు నిర్వహిస్తారు. అయితే వీరందరికీ పోలీస్‌శాఖ నిబంధనలే వర్తిస్తాయి. స్థానిక పోలీసులతో కలసి పనిచేయాలి.

పర్యాటక పోలీసుల విధులు

- పర్యాటక ప్రదేశాలను సందర్శించే దేశీయ, విదేశీ పర్యాటకులకు భద్రత కల్పించడం.
- రాష్ట్రానికి పెద్దసంఖ్యలో పర్యాటకులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర పర్యాటక రంగంపై అవగాహన కల్పించడం.
- పర్యాటక ప్రదేశాలపై ప్రచార కార్యకలాపాలు.
- పర్యాటకులకు సరైన భద్రత, జిల్లాలోని పర్యాటక ప్రదేశాల సమాచారాన్ని తెలియచేయడం.
- పర్యాటక ప్రాంతాల్లో నేరాలను అరికట్టడం, సందర్శకుల భద్రతకు ముఖ్యంగా మహిళా పర్యాటకులపై ప్రత్యేక శ్రద్ధ, పర్యాటక ప్రదేశాల్లో చిహ్నాలు, రవాణా కేంద్రాల వద్ద క్రమం తప్పకుండా గస్తీ, జనసమూహ నియంత్రణ.
- దారి తప్పిపోయిన పర్యాటకులను గమ్యస్థానాలకు చేర్చడం, స్థానిక ఆచారాలను తెలియజేయడం. అవసరమైన పర్యాటకులకు సహాయం, సమాచారం అందించడం.
- సందర్శకుల భద్రత తదితర అంశాల ద్వారా స్థానిక పర్యాటక ప్రదేశాలకు సానుకూల బ్రాండ్ ఇమేజ్ కల్పించడం.

పర్యాటక పోలీసులతో పర్యాటకులకు భద్రత

పర్యాటక పోలీసులతో పర్యాటకులకు భద్రత లభించనుంది. ఇప్పటివరకు వారి భద్రత స్థానిక సందర్శనీయ స్థలాల సిబ్బందిపైనే ఉండేది. దీంతో పలు సమస్యలు ఎదురయ్యేవి. ఇక నుంచి ఆ చిక్కులు తప్పడంతో పాటు పర్యాటక పోలీసుల విధులతో స్థానిక సందర్శనీయ స్థలాల బ్రాండ్ ప్రతిష్ఠ పెరగడం, అంతిమంగా తెలంగాణ టూరిజానికి ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది.



- కే ధనుంజనేయులు, జిల్లా పర్యాటకశాఖ అధికారి, యాదాద్రి భువనగిరి.

ప్రజాబాటతో విద్యుత్ సమస్యల పరిష్కారం

భువనగిరి టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజాబాటతో విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కారం అవుతాయని ట్రాన్స్‌కో డీఈ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రమైన భువనగిరిలో ప్రజాబాటను ప్రారంభించి, మాట్లాడారు. ప్రజాబాట పేరిట బస్తీలకు వచ్చే అధికారులు, సిబ్బందికి సమస్యలను వివరించి పరిష్కరించుకోవాలని సూచించారు. ఎల్బీనగర్, రాంనగర్ ప్రాంతాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించి, అవసరమైన మరమ్మతులు చేశారు. విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను నరికి వేశారు. వినియోగదారులతో మాట్లాడారు. ఏడీఈ ఆనంద్‌రెడ్డి, ఇన్‌చార్జి డీటీ సత్యనారాయణరాజు, టౌన్ ఏఈ పీ సాయికృష్ణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాంపల్లి కోర్టుకు హాజరైన ఎమ్మెల్యే కుంభం


నాంపల్లి కోర్టుకు హాజరైన ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ ముట్టడి కేసులో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి శనివారం నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. డీసీసీ అధ్యక్ష హోదాలో ఉండగా అప్పటి ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ రాజ్‌భవన్‌కు వెళ్తున్న క్రమంలో పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో భాగంగా ఆయన నాంపల్లి కోర్టులో శనివారం హాజరై తమ వాదాన్ని వినిపించారు. ఆయన వెంట బీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ ఉన్నారు.

దొంగకు దేహశుద్ధి, పోలీసులకు అప్పగింత


దొంగను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

నార్కట్‌పల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఒంటరిగా ఉన్న మహిళ పుస్తెల తాడును అపహరించిన దొంగను పట్టుకుని దేహశుద్ధి చేసిన గ్రామస్థులు ఆ దొంగను పోలీసులకు అప్పగించారు. అతడి నుంచి పుస్తెలతాడును స్వాధీనం చేసుకుని ఆమెకు అప్పగించారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని దాసరిగూడెంలో శనివారం ఈ ఘటన జరిగింది. దాసరిగూడెం గ్రామానికి చెందిన ఉప్పుల సునీత భోజనం బాక్స్‌ను తీసుకుని నడుచుకుంటూ పత్తి చేనుకు వెళ్తోంది. అదే సమయంలో వచ్చిన ఓ యువకుడు ఏదో సమాచారం అడిగినట్టుగా నటించి సునీత మెడలోని సుమారు 3తులాల విలువైన పుస్తెలతాడును బలంగా లాగాడు. తేరుకున్న సునీత వెంటనే అతడిని ప్రతిఘటించే ప్రయత్నం చేసినా పుస్తెల తాడును తెంచుకుని పరుగెత్తాడు. దీంతో సునీత అరుపులు విని అదేదారిలో కారులో వెళ్తున్న గ్రామ మాజీ వార్డు సభ్యుడు పోగుల సైదులు, సుధాకర్‌రెడ్డి, రాంరెడ్డిలు ఆమె వద్దకు వెళ్లారు. జరిగిన విషయాన్ని ఆమె వివరించింది. అటు వైపుగా దొంగ పరిగెట్టడం గమనించిన ముగ్గురు అతడిని వెంబడించి పట్టుకున్నారు. వీరితో పాటు పరిసర పత్తి చేనుల్లో పనిచేసే ఇతర కూలీలు వచ్చి దొంగకు దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారమిచ్చారు. నార్కట్‌పల్లి ఎస్‌ఐ క్రాంతికుమార్, వీపీవో సత్యనారాయణలు వచ్చి దొంగను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిందితుడు మునుగోడు మండలం పులిపలుపుల గ్రామానికి చెందిన శివగా గుర్తించారు.

నిర్మాణంలో ఉన్న డ్రైనేజీలో పడి తీవ్రగాయాలు

చండూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : నిర్మాణంలో ఉన్న డ్రైనేజీలో పడి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చండూరులో జరిగింది. చండూరులో రోడ్డు విస్తరణలో భాగంగా డ్రైనేజీ నిర్మాణం కోసం సాయిదుర్గా కమర్షియల్ కాంప్లెక్స్ ముందు తవ్విన గోతిపై స్లాబ్ వేయకుండా వదిలేశారు. కాంప్లెక్స్‌లో ఓ దుకాణం నిర్వహించే సంగెపు సుదర్శన్ రాత్రి దుకాణం ముగించుకుని ఇంటికి వెళ్లే సమయంలో కాలు జారి నిర్మాణంలో ఉన్న డ్రైనేజీలో పడ్డాడు. దీంతో స్లాబ్‌పై మేకులు కడుపులో గుచ్చుకుని తీవ్రంగా గాయపడినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు వారు తెలిపారు. ప్రమాదానికి అధికారులు, కాంట్రాక్టర్ బాధ్యత వహించి సుదర్శన్ కుటుంబానికి న్యాయం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్

నల్లగొండ క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆటోలో మరిచిపోయిన ల్యాప్‌టాప్‌తో పాటు నగదును తిరిగిచ్చి ఆటో డ్రైవర్ నిజాయితీని చాటుకున్నాడు. వివరాల్లోకి వెళితే నెమ్మాని సంధ్య నల్లగొండ నుంచి మిర్యాలగూడకు ఆటోలో ప్రయాణించింది. ఆటో నుంచి దిగిన క్రమంలో తనకు సంబంధించిన ల్యాప్‌టాప్‌తో పాటు రూ.1500 నగదును మరిచిపోయింది. కొద్దిసేపటి తర్వాత గమనించిన ఆటోడ్రైవర్ ఎండీ లతీఫ్ ల్యాప్‌టాప్‌ను, నగదును టూటౌన్ పోలీసుస్టేషన్‌లో అప్పగించాడు. ఎస్‌ఐ సైదులు తన సిబ్బందితో విచారణ జరిపించి సంధ్యను సంప్రదించి ఆమెకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆటోడ్రైవర్ లతీఫ్‌ను అభినందించి, ప్రశంసించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ నాగేశ్వర్‌రావు, కానిస్టేబుల్ ఎంఏ ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


స్వామి(ఫైల్)

చౌటుప్పల్ రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం చౌటుప్పల్ పట్టణ కేంద్రానికి చెందిన పల్లె స్వామి(50) కొంతకాలంగా అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. దీనికి తోడు ఉపాధి లేకపోవడంతో మనస్థాపానికి గురైన స్వామి హనుమాన్‌నగర్‌లోని అద్దె ఇంట్లో ఉరివేసుకున్నాడు. భార్య పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి రాగా భర్త ఫ్యాన్‌కు వేళాడుతూ కనిపించాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. స్వామికి కుమార్తె ఉండగా వివాహమైంది.

దుబాయ్‌కు వెళ్తున్నానంటూ

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): 'దుబాయ్‌కు వెళ్తున్నా, మూడు నెలల వరకు తిరిగి రాను' అంటూ ఇంట్లో చెప్పిన సూర్యాపేట జిల్లాకు చెందిన యువకుడు హైదరాబాద్ నగర శివారులో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా ఎర్కారం గ్రామానికి చెందిన బొర్ర నరేష్ కాలుష్య తనిఖీ వాహనంలో పనిచేస్తూ షేక్‌పేటలో ఉంటున్నారు. సెప్టెంబరు 29న ఇంట్లో నుంచి వెళ్లిన అతడు సోదరుడికి ఫోన్ చేసి దుబాయ్ వెళ్తున్నా, మూడు నెలల వరకు రానంటూ చెప్పాడు. అనంతరం అతడి ఫోన్‌స్విచ్ఛాఫ్ చేశాడు. మరునటి రోజు అతడి సోదరుడు రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు పెట్టాడు. అయితే అతడు కవాడిపల్లి గుట్టల్లో ఉరేసుకుని ఉండగా శనివారం స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం వద్ద లభించిన ఆధారాలతో మృతుడి వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆర్థిక ఇబ్బందులతో మానసికంగా కుంగిపోయి ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. నరేష్ సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు తెలిపారు.

నందీశ్వరుడికి పంచామృత అభిషేకం


నందీశ్వరుడికి అభిషేకం నిర్వహిస్తున్న పండితులు

మేళ్లచెర్వు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ కాశీగా పేరొందిన సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులోని శ్రీఇష్టకామేశ్వరి సమేత స్వయంభు శంభులింగేశ్వరస్వామి దేవస్థానంలో బహుళ త్రయోదశి సందర్భంగా శనివారం నందీశ్వరుడికి పంచామృత అభిషేకం నిర్వహించారు. ప్రాతఃకాలమున గణపతిపూజ, పుణ్యాహవాచనం, మహాన్యాసపూర్వక, రుద్రాభిషేకం, సహస్రనామార్చన, మహాలింగార్చన, పుష్పార్చన అనంతరం మహానివేదన, మంగళనీరాజనం, తీర్థప్రసాద వినియోగం, సాయంత్రం నందీశ్వరుడికి పంచామృతాలతో అభిషేకాన్ని వేదపండితులు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఈవో నాగేళ్ల శంభిరెడ్డి, చైర్మన్ శాగంరెడ్డి శంభిరెడ్డి, సభ్యులు కమతం శ్రీనివాసరావు, కర్నాటి సత్యనారాయణరెడ్డి, అర్చకులు కొంకపాక శివ విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ, సాయిమహేష్‌శర్మ, దేవాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక లారీ, ట్రాక్టర్ల పట్టివేత

కోదాడ రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి హైదరాబాద్‌కు ఇసుకను తరలిస్తున్న రెండు లారీలను పట్టుకుని సీజ్ చేసినట్లు సూర్యాపేట జిల్లా కోదాడ రూరల్ ఎస్‌ఐ గోపాల్‌రెడ్డి తెలిపారు. తూర్పుగోదావరిలోని పత్తిపాడు నుంచి రెండు లారీల్లో ఇసుకను లోడ్ చేసుకుని హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. శనివారం తెల్లవారుజామున మండలంలోని రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. డ్రైవర్లు, యజమానులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

డిండి : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు నల్లగొండ జిల్లా డిండి ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు. దేవరకొండ మండలం తాటికోలు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను చెర్కుపల్లి స్టేజీ వద్ద రాత్రి 2గంటల సమయంలో అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

త్వరగా పనులు చేపట్టాలి


ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

చిలుకూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : భవిత కేంద్రం పనులను వెంటనే చేపట్టి, త్వరగా పూర్తి చేయాలని సూర్యాపేట జిల్లా కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ అన్నారు. చిలుకూరు ఎమ్మార్సీ కార్యాలయంలో సుమారు రూ.10లక్షలతో నిర్మించనున్న భవితా కేంద్ర ప్రతిపాదిత నిర్మాణ స్థలాన్ని ఆయన శనివారం పరిశీలించారు. తక్షణమే పనులు చేపట్టి పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ ధ్రువకుమార్, ఎంఈవో గురవయ్య పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని ఏఎన్‌ఎం మృతి


సుజాత(ఫైల్)

వలిగొండ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్, స్కూటీ ఢీకొని ఏఎన్‌ఎం మృతి చెందింది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ ఎస్‌ఐ యుగేందర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం వలిగొండకు చెందిన పోలేపాక సుజాత అలియాస్ దేవరాయ సుజాత(43) వర్కట్‌పల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్‌ఎంగా విధులు నిర్వహిస్తోంది. శనివారం విధులు ముగించుకొని తిరుగు ప్రయాణంలో స్కూటీపై చిన్నకుమారుడు దేవాన్ష్‌తో కలిసి వస్తోంది. గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనం నడుపుతూ ఎలాంటి హెచ్చరికలు లేకుండా కుడివైపుకు ట్రాక్టర్‌ను తిప్పాడు. ఫలితంగా ట్రాక్టర్ ట్రాలీ సుజాత స్కూటీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుజాత, ఆమె కుమారుడు కిందపడ్డారు. ట్రాలీ సుజాత తలపై నుంచి వెళ్లింది.ఈ దుర్ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. చిన్న కుమారుడికి ఎడమ కాలుకు తీవ్ర రక్తస్రావం జరిగింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. భర్త దేవరాయ కృష్ణ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అది హైనా పాదం


అనుమానాస్పద పాదముద్రలను పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం పిలాయిపల్లి సమీపంలో స్థానికులు గుర్తించిన పాదముద్రలు అడవి జంతువు హైనావి అని ఎస్‌ఐ కే భాస్కర్‌రెడ్డి తెలిపారు. గ్రామం నుంచి దేశ్‌ముఖి గ్రామానికి వెళ్లే దారిలో బీఎస్‌సీపీఎల్ కంపెనీ పరిసర ప్రాంతాల్లో చిరతపులి పాదముద్రలుగా అనుమానాస్పదంగా కనిపించడంతో ప్రజలు కలవరపడ్డారు. అయితే ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి శనివారం సమాచారం మేరకు ఫారెస్టు డిపార్ట్‌మెంట్ అధికారులు ఆయా పాదముద్రలు పరిశీలించారు. పాదముద్రలు చిరుతపులివి కావని, హైనా అనే అడవి జంతువువిగా వారు గుర్తించారు. ఈ ప్రాంతంలో పరిసర ప్రాంతాల ప్రజలు రాత్రివేళ వెళ్లేవారు జాగ్రత్తగా ఉండాల్సిందిగా ఎస్‌ఐ తెలిపారు.

చింతపల్లిలో వ్యక్తి అదృశ్యం



చింతపల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు నల్లగొండ జిల్లా చింతపల్లి ఎస్‌ఐ రాంమూర్తి తెలిపారు. రంగారెడ్డి జిల్లా మాడ్గుల్ మండలం అంతంపేట గ్రామానికి చెందిన పోలే వెంకటయ్య మానసిక స్థితి బాగాలేక తరచూ పలుగ్రామాలకు వెళ్తున్నాడు. రోజు మాదిరిగానే ఈ నెల 11న చింతపల్లికి వచ్చారు. సాయంత్రం 4.30 సమయంలో ఆటోఎక్కినట్లు బంధువులు గుర్తించారు. అనంతరం ఆయన ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. వెంకటయ్య ఆచూకీ తెలిసిన వారు 8712670230 ఫోన్ నెంబరుకు సమాచారం అందించాలని ఎస్‌ఐ తెలిపారు.

విద్యా బోధనకు డిజిటల్ వెలుగులు

● ఖాన్ అకాడమి కంటెంట్‌తో సైన్స్, గణితంలో ఆన్‌లైన్ క్లాసులు ● హైస్కూళ్లు, జూనియర్ కళాశాల విద్యార్థులకు బోధన ● సమర్థవంతమైన పర్యవేక్షణకు రివార్డులు

తరగతి గదిలో విద్యా బోధనకు డిజిటల్ వెలుగులు అద్దేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. బోధనాంశాలు మరింత సులువుగా విద్యార్థులకు అర్థమయ్యేలా చూసేందుకు సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తేనున్నారు. హైస్కూల్, జూనియర్ కళాశాలస్థాయి విద్యార్థులకు రోజుకు గంటపాటు మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్ట్‌లలో తర్ఫీదు ఇచ్చేందుకు విద్యాశాఖ అధికారులు టైంటేబుల్‌ను నిర్ణయించే దిశగా ముందుకు సాగుతున్నారు.

(ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ)

రాష్ట్రంలో న్యాస్(ఎన్‌ఏఎస్), ఇతర మూల్యాంకనంలో అభ్యసన అంతరాలను పరిష్కరించేందుకు ఖాన్ అకాడమీ కంటెంట్‌ను ఉపయోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. 6 నుంచి 10వ తరగతి హైస్కూల్, జూనియర్ కళాశాలల విద్యార్థులకు తరగతి బోధనకు అనుగుణంగా డిజిటల్ కంటెంట్ ఉపయోగించి ఫలితాలు మెరుగుపర్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు విద్యాశాఖ ఉన్నతాధికారులు సంబంధిత సబ్జెక్ట్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి పాఠశాలలకు డిజిటల్ లెర్నింగ్ పుస్తకాలను సైతం సరఫరాచేశారు. నల్లగొండ జిల్లాలో సుమారు 258 హైస్కూళ్లలో విద్యార్థులకు కేఏ కంటెంట్ అమలు చేసేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే విద్యార్థులకు మెయిల్ ఐడీలు రూపొందించగా అక్టోబరు చివరివారం నుంచి వీడియోల ద్వారా లెర్నింగ్ క్లాసులు చేపట్టనున్నారు.

శిక్షణ పూర్తి

తరగతి గది బోధనతోపాటు ఖాన్ అకాడమీ ఇండియా కంటెంట్‌ను ఉపయోగించి మెరుగైన ఫలితాలు సాధించేలా సమర్థవంతమైన పర్యవేక్షణ కోసం జిల్లా విద్యాధికారి, ఎంఈవోలకు దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. గత ఏప్రిల్, మే నెలలో పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయుల చొప్పున శిక్షణా తరగతులను పూర్తిచేశారు. తరగతులవారీగా వారంలో రెండు రోజుల పాటు కేఏ కంటెంట్ వీడియోలు వీక్షించి అసైన్‌మెంట్‌లు పూర్తి చేసేలా



చూడాల్సి ఉంది. తల్లిదండ్రుల స్మార్ట్‌ఫోన్ ద్వారా లేదా తరగతి గదిలోని డిజిటల్ క్లాస్‌రూమ్‌లలో విద్యార్థులు అభ్యసనను పూర్తి చేసేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉంది. డిజిటల్ లెర్నింగ్ బుక్స్ ద్వారా పిల్లలు ఆన్‌లైన్ మోసాల బారినపడకుండా అవగాహన పెంచేందుకు ఉపయోగపడతాయని అంటున్నారు. కోడింగ్, డేటా సైన్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డిజైన్ థింకింగ్‌తోపాటు డిజిటల్ సిటిజన్‌షిప్‌పై అవగాహన పెంచేలాడిజిటల్‌లెర్నింగ్ బుక్స్ ఉపయోగపడతాయని అంటున్నారు.

అమలుకు సన్నాహాలు

శిక్షణ పొందిన ఉపాధ్యాయులు కేఏ ప్లాట్‌ఫామ్‌లో పాఠశాలను నమోదు చేయడంతోపాటు గణితం, సైన్స్‌లకు సంబంధించి ఖాన్‌అకాడమీ(కేఏ) ఫ్లాట్‌ఫామ్‌లో ఇ-తరగతి గదిని సృష్టించి విద్యార్థులందరికీ పేరు, పాస్‌వర్డ్‌లను ఏర్పాటు చేసేలా చూడాల్సి ఉంది. సాధారణ తరగతి గదిలో ఉపాధ్యాయులు టాపిక్ బోధించిన తర్వాత ఆన్‌లైన్ కంటెంట్‌ను వీక్షించడానికి కే ప్లాట్‌ఫామ్‌లో విద్యార్థులకు అంశాన్ని కేటాయించి కంప్యూటర్ ల్యాబ్ గ్రూపు కార్యకలాపాల ద్వారా కేఏ వీడియోలు వీక్షించేలా చూడాల్సి ఉంటుంది. విద్యార్థులు వారి లాగిన్ల ద్వారా వారి వ్యక్తిగత ఖాతాలను యాక్సెస్ చేయడం ద్వారా అసైన్‌మెంట్‌లను పూర్తి చేయడం పర్యవేక్షించి ఉపాధ్యాయుల పనితీరును సమీక్షించేలా కార్యాచరణ రూపొందించారు.

పాఠశాల టైంటేబుల్‌కు అంతరాయం కలుగకుండా వారానికి ఒక గణితం, సైన్స్ పీరియడ్లను రూపొందించి విద్యార్థులకు కేఏ వీడియోల వీక్షణకు అవకాశం కల్పించనున్నారు. ఈ విధమైన బోధనకు సంబంధించి పాఠశాలల్లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి కేఏ కంటెంట్ గూర్చి వివరించాల్సి ఉందని అధికారులు అంటున్నారు. తల్లిదండ్రుల వద్ద స్మార్ట్‌ఫోన్‌లు ఉంటే వారంలో రెండు రోజులు.. రెండు గంటలపాటు దానిని తమ పిల్లలకు ఇవ్వవచ్చునని తెలియజెప్పాల్సి బాధ్యత పాఠశాల ఉపాధ్యాయులది. సమావేశాల్లో పిల్లల పనితీరును తల్లిదండ్రులకు వివరించడం ద్వారా అభ్యసన పరిస్థితిని మరింతగా మెరుగుపరిచే అవకాశం ఉందని అంటున్నారు.

సమర్థవంతమైన పర్యవేణకు రివార్డులు

విద్యార్థుల అభ్యసనా ఫలితాలను మెరుగుపరిచేందుకు నూతనంగా వినియోగంలోకి తేనున్న కేఏ కంటెంట్ సమర్థవంతగా అమలయ్యేలా సంబంధిత సబ్జెక్ట్ ఉపాధ్యాయులు, పాఠశాలల అధిపతులు పర్యవేక్షణ చేయాల్సి ఉంటుందని అంటున్నారు. ఉత్తమ పనితీరు కనబరిచిన ఉపాధ్యాయులను, పాఠశాల ప్రధానోపాధ్యాయులతోపాటు విద్యార్థులను గుర్తించి కలెక్టర్, డీఈవోలు రివార్డులను అందజేసి ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినట్లు విద్యాధికారులు అంటున్నారు. కార్యక్రమ అమలును పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు నలుగురు, ఖాన్ అకాడమీనుంచి ముగ్గురు సభ్యులతో కలిసి కమిటీ పర్యవేక్షించేలా నిర్ణయించినట్లు తెలిపారు.

అవగాహన బలోపేతం

విద్యార్థుల భావనాత్మక అవగాహనను బలోపేతం చేయడం, పని తీరును ట్రాక్ చేయడం కోసం అవసరమైన సాధనాలతో ఉపాధ్యాయులకు సాధికారత కల్పించాలనే లక్ష్యంతో ఖాన్ అకాడమి కంటెంట్‌ను ఉపయోగించేందుకు విద్యాధికారులు నిర్ణయించారు. పాఠశాల విద్యాశాఖ పరిధిలోని మోడల్‌స్కూళ్లు, కేజీబీవీఎస్, టీఆర్‌ఈఐఎస్ ప్రభుత్వ, స్థానిక ఉన్నత పాఠశాల్లో సైన్స్ గణితం సబ్జెక్ట్‌లలో అభ్యాసన ఫలితాలు మెరుగుపరిచేలా చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది.

విద్యార్థుల ఉన్నతికి దోహదం



పాఠశాలలోని విద్యార్థులకు గణితం, సైన్స్ సబ్జెకులపై ఉన్న బెరుకును తగ్గించి విద్యలో వారిని ఉన్నతులుగా తీర్చేదిద్దేందుకు కేఏ కంటెంట్ ఉపయోగపడుతుంది. ఖాన్ అకాడమీ రూపొందించిన సబ్జెక్ట్ వీడియోలను వీక్షించడంతోపాటు వ్యక్తిగతంగా విద్యార్థుల అభ్యసనను మెరుగుపరిచేవిధంగా ఉపాధ్యాయుల పర్యవేక్షణ ఉంటుంది. కార్పొరేట్‌స్థాయి విద్యార్థులకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా అమలు చేస్తాం.

ఉమ్మడి సైదిరెడ్డి, గెజిటెడ్ హెడ్‌మాస్టర్, చెన్నాయిపాలెం

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

● పూజల్లో పాల్గొన్న బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు



స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి వారి దివ్యక్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్య పూజలు జరిగాయి. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠా మూర్తులను వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసీ దళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. అదేవిధంగా అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవార్లను ముగ్ధమనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడికి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించిన అర్చకులు సాయంత్రం వెండిజోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి మహామండపంలో స్ఫటికమూర్తులకు నిత్యారాధనలు, యాగశాలలో నిత్య రుద్రహవన పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 19,14,796 ఆదాయం సమకూరినట్లు ఇన్‌చార్జీ ఈవో గుగులోత్ రవినాయక్ తెలిపారు.

కాగా, స్వామివారిని ఒలంపిక్ ఛాంపియన్, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు, మానవహక్కుల కమిషన్ సభ్యుడు కిషోర్ కుటుంబ సమేతంగా వేర్వేరుగా దర్శించుకున్నారు. స్వామివారి నిత్య కల్యాణోత్సవంలో సింధు కుటుంబం పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.



నృసింహక్షేత్రంలో సింధు దంపతులు

నాణ్యమైన వైద్య సేవలందించాలి

● మెడికల్ బోర్డు కౌన్సిల్ సభ్యుడు రాజీవ్‌నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న రాజీవ్‌నాయక్

భానుపురి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): అర్హతలేని వ్యక్తులని కమీషన్స్ ద్వారా ప్రోత్సహించడం సరికాదని, ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలందించాలని రాష్ట్ర మెడికల్ బోర్డు కౌన్సిల్ సభ్యుడు రాజీవ్‌నాయక్ అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమీషన్లు, అనవసరమైన టెస్టులు, ఔషధ వినియోగం అనేవి ప్రజలను వేధిస్తున్నాయన్నారు. వ్యాపార దృష్టితో తీసుకునే నిర్ణయాలు రోగుల ప్రాణాలపై ప్రభావం చూపుతున్నాయన్నారు. కమీషన్లకోసం దళారులు అమాయక రోగులను ఖమ్మం తీసుకువెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హత కలిగిన వైద్యుల ద్వారా మాత్రమే నాణ్యమైన వైద్య సేవలను అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాల సంఘం నాయకులు చింతరెడ్డి పాపిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, బి.రమేష్, లింగస్వామి, వెంకటరెడ్డి, శ్రీనివాస్, ప్రభాకర్, నరేష్, బుచ్చిబాబు, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

588.70 అడుగుల వద్ద సాగర్ నీటిమట్టం

నాగార్జునసాగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం శనివారం సాయంత్రానికి 588.70 అడుగులుగా ఉంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా, శనివారం సాయంత్రానికి 588.70 అడుగులు (308.1702టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడికాల్వ ద్వారా 9,302 క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 8,454 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 33,779 క్యూసెక్కులు, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1,200 క్యూసెక్కులు, వరదకాల్వ ద్వారా 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 53,035 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా, ఎగువ నుంచి 53,035 క్యూసెక్కుల వరద సాగర్‌కు వచ్చి చేరుతోంది.

మూసీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. హైదరాబాద్ నగరంతోపాటు ఎగువ మూసీ పరివాహక ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వరదనీరు వచ్చి ప్రాజెక్టులో చేరుతుంది. దీంతో ప్రాజెక్టు అధికారులు పది రోజులకుపైగా ఎత్తి ఉంచిన ఒక్కో క్రస్టుగేటును క్రమంగా మూసివేస్తూ నీటిమట్టాన్ని 645అడుగుల గరిష్ఠ స్థాయికి చేర్చుతున్నారు. ఈక్రమంలో శుక్రవారం సాయంత్రానికి 2502.06 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో శనివారం సాయంత్రానికి కొంతమేర తగ్గి 2034.36క్యూసెక్కులు గా నమోదైంది. ప్రాజెక్టు నీటిమట్టం గరిష్ఠ స్థాయినుంచి తగ్గకుండా ఉంచుతున్న అధికారులు ఎగువనుంచి వస్తున్న ఇన్‌ఫ్లోను ప్రాజెక్టు 8 క్రస్టుగేట్లను 2అడుగుల మేర ఎత్తడం ద్వారా 1319.55క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ఆయకట్టుకు విడుదలవుతున్న మరో 292.68క్యూసెక్కుల నీటిని కలుపుకుని ప్రాజెక్టు నుంచి మొత్తం 1663.85క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 645అడుగులు(4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యంగల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 644.40అడుగులు(4.30టీఎంసీలు)గా ఉంది.



నిండుకుండలా నాగార్జునసాగర్ ప్రాజెక్ట్

కాలం చెల్లిన మందులిచ్చారని..

● ఆస్పత్రి ఎదుట బాధితుడి నిరసన

తుర్కపల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): వైద్యంకోసం ఆస్పత్రికి వెళితే కాలం చెల్లిన మందులిచ్చారంటూ బాధితుడు ఆసుపత్రి ఎదుట బైఠాయించి ఆందోళన వ్యక్తం చేశాడు. ఈ సంఘటన శనివారం తుర్కపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగింది. తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామానికి చెందిన తొలిచుక్క అంజయ్యకు మూడు రోజులక్రితం ఇనుప ముక్క దిగి కాలుకు గాయమైంది. చికిత్సకోసం మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి వచ్చాడు. డాక్టర్ రుచిరారెడ్డి అతనికి వైద్య పరీక్షలు నిర్వహించి వాడాల్సిన మందులకు సంబంధించి చీటీ రాసి ఇచ్చారు.



ఆస్పత్రి ఎదుట నిరసన తెలుపుతున్న రోగి అంజయ్య, (ఇన్‌సెట్‌లో) కాలం చెల్లించిన మందు

అంజయ్య ఆ మందుల చీటీని తీసుకొని మెడికల్ స్టోర్‌కు వెళ్లాడు. స్టాఫ్ నర్సు రజిత అతనికి కాలం చెల్లిన మందులు ఇచ్చిందని, దీనిపై ప్రశ్నించగా సరైన సమాధానం ఇవ్వకపోవడంతో అంజయ్య అతని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై డాక్టర్ రుచిరారెడ్డిని వివరణ కోరగా కాలం చెల్లిన మందులు ఇవ్వడం సరికాదని, ఈ విషయంపై జిల్లా వైద్యాధికారికి నివేదిక అందజేస్తానన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

● తెలంగాణ సింగరేణి కాలరీస్ సంస్థ ప్రతినిధులు

హుజూర్‌నగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని ఆర్డీవో శ్రీనివాసులు, తెలంగాణ సింగరేణి కాలరీస్ సంస్థ జనరల్ మేనేజరల్ మేనేజర్ డి.రామస్వామి, డిప్యూటీ జనరల్ మేనేజర్, ఆజ్మీరా తుల్జీరామ్ తెలిపారు. శనివారం పట్టణంలోని పాత విజ్ఞాన్ స్కూల్‌లో జాబ్‌మేళా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా సుమారు 5వేల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు పెద్ద ఎత్తున ఈ నెల 25న జాబ్‌మేళా నిర్వహిస్తుందన్నారు. సింగరేణి సీఎండీ ఆధ్వర్యంలో ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సారథ్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించనున్నట్లు తెలిపారు. చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌లాంటి ప్రాంతాల నుంచి బడా కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొంటాయన్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. యువతీ, యువకులకు వేర్వేరు కౌంటర్లు ఏర్పాటుచేస్తామన్నారు. కార్యక్రమంలో జాబ్‌మేళా హెచ్‌ఆర్ పుల్లారి చందర్, రవికుమార్, సుధాకర్, కాంగ్రెస్ నాయకులు తన్నీరు మల్లికార్జున్ రావు, కోడి ఉపేందర్, చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, వంగవేటి రామారావు, కమిషనర్ శ్రీనివాసరెడ్డి, ఉద్దండు, కస్తాల సైదులు, దిల్లు, శేఖర్, అశోక్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.



జాబ్‌మేళా స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో, సింగరేణి కాలరీస్ సంస్థ ప్రతినిధులు

కుందేలుకు శస్త్ర చికిత్స





దూడ, కుందేలుకు శస్త్ర చికిత్స చేస్తున్న డాక్టర్ పెంటయ్య

కోదాడ రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కుందేలు కాలుకు శస్త్ర చికిత్స చేసినట్లు స్థానిక ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పెంటయ్య తెలిపారు. పట్టణానికి చెందిన ఏలూరి మహేశ్వరి పెంచుకుంటున్న మూడు నెలల కుందేలు పిల్ల ముందు కాలు ఎముకలు ప్రమాదంలో విరిగాయని, యజమాని శనివారం ప్రాంతీయ పశువైద్యశాలకు తీసుకురాగా పరీక్షించినట్లు తెలిపారు. కుందేలు కాలుకు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ముక్కలు తెప్పించి విరిగిన ఎముకలను కలుపుతూ సిమెంట్ కట్టువేసి కాలును అతికించినట్లు వివరించారు. చికిత్స చేసి కుందేలుకి కాలు అతికించడంతో యజమాని హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో అనంతగిరి మండల పశువైద్యాధికారి సిరిపురపు సురేందర్, చంద్రకళ పాల్గొన్నారు.

దూడకు శస్త్ర చికిత్స

మలద్వారం లేకుండా పుట్టిన దూడకి శస్త్ర చికిత్సతో మలద్వారం ఏర్పాటు చేసినట్లు స్థానిక ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ పెంటయ్య తెలిపారు. మండలంలోని నెమలిపురి గ్రామానికి చెందిన వనపర్తి తిరుమలాచారి ఇంట్లో గేదెకి మూడురోజుల క్రితం మగదూడ పుట్టింది. కానీ పుట్టుకతోనే మలద్వారం లేకుండా దూడ పుట్టడంతో పొట్టలోని మలినాలు బయటకు రాక పొట్ట ఉబ్బి నొప్పితో ఇబ్బంది పడుతుంది. దీంతో దూడను శనివారం పశువైద్యశాలకు తీసుకురాగా, పరీక్షించి అత్యవసర శస్త్రచికిత్స చేసి పుట్టుకలో జన్యులోపం వలన మలద్వారం గొట్టం ఏర్పాటు కాకపోవడంతో పరీక్షించి లోపలినుంచి కృత్రిమ ద్వారం ఏర్పాటు చేసి మలం బయటకు రావడానికి మార్గం ఏర్పాటు చేశామన్నారు. ఈ శస్త్ర చికిత్సలో చంద్రకళ పాల్గొన్నారు.

సాగర్‌లో మధ్యప్రదేశ్ విశ్రాంత డీజీపీ

నాగార్జునసాగర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌ను శనివారం మధ్యప్రదేశ్ విశ్రాంత డీజీపీ, సీబీఐ మాజీ డైరెక్టర్ రిషి కుమార్ శుక్ల కుటుంబ సమేతంగా సందర్శించారు. సాగర్ సందర్శనలో భాగంగా ఆయన బుద్ధవనం, అనుపు, ఎత్తిపోతల, నాగార్జునకొండ మ్యూజియంను తిలకించారు. ఆయనవెంట బుద్ధవనం ఈవో శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర ఉన్నారు.



మ్యూజియంలో రిషికుమార్ శుక్ల

వరికి ఎండు తెగులు తంటా

● సస్యరక్షణ చర్యలతో నివారణ ● ఏవో యం. పార్వతి చౌహాన్





ఎండుతెగులుతో దెబ్బతింటున్న వరి, ఏవో పార్వతి చౌహాన్

త్రిపురారం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వరి పంటలో సాధారణ బ్యాక్టీరియాతో ఆకు ఎండు తెగుళ్లు సోకి దిగుబడి తగ్గుతుంది. ఈ క్రమంలో సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా పాటించాలని ఏవో ఎం.పార్వతి చౌహాన్ సూచించారు. ఎండు తెగుళ్ల నివారణ కోసం ఆమె పలు సూచనలు చేశారు.

● ఎండు తెగులు ముఖ్యంగా అధిక వర్షాలు, అధిక నత్రజని, ఎరువుల వినియోగం, పొలం గట్లపై పిచ్చిమొక్కలు పెరగడం వల్ల సోకుతుంది. ఈ తెగులు ఉన్నప్పుడు ఆకులపై పసుపు రంగు మచ్చలు ఏర్పడి ఎండిపోతాయి. వాటి నివారణకోసం సరైన మోతాదులో ఎరువులు వాడాలి. పొలం గట్లను శుభ్రంచేయాలి. తెగులు సోకిన మొక్కల నుంచి ఆరోగ్యకరమైన మొక్కలకు నీరు ప్రవహించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

లక్షణాలు

ఆకులపై తొలుత పసుపు రంగు మచ్చలు ఏర్పడతాయి. ఈ మచ్చలు ఆకుల అంచుల నుంచి ఎండి పోవడం మొదలవుతుంది. ఉదయం వేళ ఆకుల మీద పసుపు రంగు జిగురు లాంటి ద్రవం కన్పిస్తుంది. అది ఎండకు గట్టిపడి రాలిపోతుంది. ఆకులు గోధుమ రంగులోకి మారుతాయి.

సోకడానికి కారణాలు

ఎడతెరిపి లేకుండా రోజుల తరబడి వర్షాలు కురవడం. అధిక మోతాదులో నత్రజని, ఎరువులు వాడకం, పొలంగట్ల పై పిచ్చి మొక్కలు విపరీతంగా పెరగడం వంటివి ఎండు తెగుళ్ల సోకడానికి కారణాలు. పంట తెగుళ్లను తట్టుకోలేని రకాలను సాగు చేయడం, గతేడాది పంట అవశేషాలు విత్తనాల ద్వారా వ్యాప్తి చెందుతాయి.

నివారణ చర్యలు

సిఫార్సు చేసిన మోతాదులో మాత్రమే నత్రజని ఎరువులు వాడాలి. పొలం గట్లపై పిచ్చిమొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలి. తెగులు సోకిన మొక్కల నుంచి ఆరోగ్యకరమైన మొక్కలకు నీరు పారకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నాటే ముందు అంకురం ఏర్పడే దశలో ఎకరాకు 20 కిలోల చొప్పున పొటాష్ ఎరువు వేయాలి. తెగుళ్ల ఉంటే 10 లీటర్ల నీటికి 30 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్, నాలుగు గ్రాముల ప్లాంటోమైసిన్ లేదా నాలుగు గ్రాములు పోషామైసిన్, స్ట్రెప్టోసైక్లిన్ కలిపి 10-15 రోజుల వ్యవధిలో 2-3 సార్లు పిచికారీ చేయాలి.

రైతులు నాణ్యమైన ధాన్యం తేవాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ లాలునాయక్

పెన్‌పహాడ్, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): రైతులు కొనుగోలు కేంద్రానికి నాణ్యమైన తీసుకొచ్చి ప్రభుత్వ మద్దతు పొందాలని తహసీల్దార్ లాలునాయక్ సూచించారు. మండలంలోని చీదెళ్ల, పెన్‌పహాడ్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ వెన్న సీతారాంరెడ్డి, ఏవో అనిల్‌కుమార్, కార్యదర్శులు సోమ్లా నాయక్, లక్ష్మణ్, రైతులు తూముల ఇంద్రసేనరావు, జూలకంటి వెంకటరెడ్డి, ధర్మయ్య, లక్ష్మీకాంతారావు తదితరులు ఉన్నారు.

సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మామిడి నరేష్

సూర్యాపేటఅర్బన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సీపీఆర్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని వెన్నెల ఆసుపత్రి ఛాతి వైద్య నిపుణులు డాక్టర్ మామిడి నరేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీసాయి త్రివేణి డిగ్రీ కళాశాలలో శనివారం వెన్నెల ఆసుపత్రి ఆధర్యంలో విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించి మాట్లాడారు. గుండె పని చేయకుండా ఆగిపోయిన వ్యక్తులకు వైద్య సాయం అందే వరకు ప్రాణాలు నిలపడానికి సీపీఆర్(కార్డియోపల్మనరీ రిససిటేషన్) అత్యవసరమన్నారు. సీపీఆర్‌పై అవగాహన ఉన్నవారు ప్రమాదంలో ఉన్న వారి పట్ల వెంటనే స్పందించి సీపీఆర్ చేస్తే ప్రాణాలు కాపాడిన వారవుతారన్నారు. కార్యక్రమంలో జనార్దన్‌రెడ్డి, అనిల్, ఉపేందర్, నారాయణ, భయ్యా దయాకర్, నాగరాజు, రియాజ్, రమ్య, మాధురి, సాయి తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్స్ పోయినవి

సాదు అపూర్వ, తండ్రి రాంరెడ్డి, గ్రా॥ రేపోని, మం॥ దంతాలపల్లి, వారికి సంబంధించిన ప్లాటు ఒరిజినల్ డాక్యుమెంట్స్ తేది : 05.10.2025న దంతాలపల్లి నుండి మద్దిరాలకు బస్సులో వెళ్తుండగా పోయినవి. దొరికినవారు సంప్ర॥ సెల్ : 9441549740

బంద్ విజయవంతం

- ముందస్తుగా సెలవు ప్రకటించిన విద్యాసంస్థలు
- స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేత
- పలు మండలాల్లో రాస్తారోకో, ర్యాలీలు

సూర్యాపేటటౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడాన్ని నిరసిస్తూ బీసీ సంఘాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన బంద్ సూర్యాపేటలో పాక్షికంగా జరిగింది. జిల్లాలో ఉదయం 10 గంటల తర్వాత సూర్యాపేట జిల్లాలో పలు వ్యాపార, వాణిజ్య దుకాణాలు యథావిధిగా తెరిచి తమ వ్యాపారాలు కొనసాగించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆర్టీసీ పరిధిలో తప్ప మిగతా చోట బంద్ అంతగా బంద్ కనిపించలేదు.



సూర్యాపేటలో ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

● భానుపురి : జిల్లా కేంద్రంలో టీఆర్‌పీ (తెలంగాణ రాజ్యాధికార పార్టీ) ఆధ్వర్యంలో ద్విచక్రవాహనాలతో ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకపోతే తడాఖా చూపి స్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టె జానయ్యయాదవ్ చాంద్‌పాషా, వల్లాల సైదులు, ఏశబోయిన మల్లేష్, కుంభం వెంకన్న, మీర్ అక్బర్, సైదులు, తదితరులు ఉన్నారు.

● అర్వపల్లి : కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) పార్టీల ఆధ్వర్యంలోమండల కేంద్రంలో బంద్ చేపట్టారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో గంటపాటు సూర్యాపేట-జనగాం రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గుడిపెల్లి మధుకర్‌రెడ్డి, కొరపిష్ట అవిలయ్య, వేల్పుల రమేష్, గుండగాని సోమేష్‌గౌడ్, బైరబోయిన సైదులు, వజ్జె శ్రీనివాస్, పోలేబోయిన కిరణ్, బైరబోయిన మహరాజు పాల్గొన్నారు.

● మద్దిరాల : మండలంలో బంద్ ప్రశాంతంగా ము గిసింది. అఖిల పక్షాల నాయకులు, కాంగ్రెస్ నాయకు లు బంద్‌లో పాల్గొన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సూర్యాపేట-దంతాలపల్లి రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు ముక్కాల అవిలమల్లు, పచ్చిపాల సుమతివెంకన్న, తాళ్లపల్లి సురేష్, అంగిరేకుల రాంమూర్తి, శ్రీనివాస్, ఉబ్బని రఘుపతి, కొమ్ము అంజయ్య, పాలబిందెల శ్రీనివాస్, లింగయ్య, మల్లయ్య, రేసు లింగయ్య, బరపటి ఉపేందర్ పాల్గొన్నారు.

●తిరుమలగిరి : తిరుమలగిరిలో బంద్ ప్రశాంతంగా ముగిసింది. బంద్‌కు మద్దతుగా వ్యాపార, వాణిజ్యవిద్యాసంస్థలు స్వచ్ఛందంగా మూసివేశారు. బీసీ జేఏసీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం నాయకులు బైక్‌ర్యాలీ నిర్వహించారు. పూలే, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వై నరేష్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాంప్రభు, మాజీ ఎంపీపీలు కొమ్మినేని సతీష్, కొత్తగట్టు మల్లయ్య, దీన్‌దయాళ్ ఎల్లంల యాదగిరి, కందుకూరి సోమన్న, లక్ష్మయ్య, ప్రవీణ్, శ్రీకాంత్ గౌడ్, నవీన్,రవీందర్, రాముగౌడ్, దానయ్య, లింగయ్య, పాల్గొన్నారు.

●పెన్‌పహాడ్ :మండల కేంద్రంలో బీఆర్ఎస్, బీసీ సంఘాల ఆధ్వర్యంలో గంటసేపు రాస్తోరోకో నిర్వహించారు. విద్యా సంస్థలు ముందుగానే సెలవు ప్రకటించారు.

● తుంగతుర్తి : నియోజకవర్గ కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పార్టీలు వ్యాపార సంస్థలను నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీపీఎం, సీపీఐ, న్యూ డెమొక్రసీ పార్టీల నాయకులు మాట్లాడుతూ ఒకవైపు బీసీ బిల్లు అడ్డుకుంటూ మరో వైపు బీసీ బంద్‌లో బీజేపీ నేతలు పాల్గొనడం ఏమిటి అని అన్నారు. కార్యక్రమంలో తుంగతుర్తి మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ చింతకుంట్ల వెంకన్న, సీపీఎం మండల కార్యదర్శి బుర్ర శ్రీనివాస్, సీపీఐ నాయకులు రాజారాం, న్యూడెమోక్రసీ నాయకులు నాగమల్లు సీపీఎం నాయకులు లింగయ్య ఓరుగంటి అంతయ్య, ఉప్పల సోమయ్య, బీఆర్ఎస్ నాయకులు తునికి సాయిలు గోపగాని రమేష్, గోపగాని శ్రీను, తడకమల్ల రవికుమార్, పూరిపాక పరమేష్, సోమ నర్సయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు నారాయణదాసు, నాగరాజు, కత్తుల నరేష్, ఉప్పుల లింగయ్య, పాల్గొన్నారు.

● నూతనకల్ : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో పాఠశాల నాయకులు బంద్ చేశారు. మండల కేంద్రంలో అఖిల పక్షం నాయకులు ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో అఖిల పక్షం నాయకులు పాల్గొన్నారు.

●నాగారం: మండల కేంద్రంలో నాగారం బంగ్లా వద్ద నేషనల్‌హైవే 365 బీ పైన వాహనాలను బీసీ సం ఘాల నాయకులు నిలిపి నిరసన వ్యక్తం చేశారు. బంద్‌లో బీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఐఎంఎల్, న్యూడెమోక్రసి, ధర్మ సమాజ్ పార్టీ నాయకులు కార్యకర్తలు పా ల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ జిల్లా కో ఆర్డినేటర్ గైగుల్ల నిరంజన్ యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోడుసు లింగయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కె.ఉప్పలయ్య వేర్వరుగా పాల్గొన్నారు.



తిరుమలగిరి బంద్‌లో పాల్గొన్న బీసీ జేఏసీ నాయకులు



సూర్యాపేట బంద్‌లో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు



తుంగతుర్తిలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ న్యూడెమోక్రసీ నాయకులు



నూతనకల్‌లో..

రూటు మారిన ఇసుక దందా

(5వ పేజీ తరువాయి)

నుంచి అనుమతులుపొంది భద్రాద్రి-కొత్తగూడెం, ములుగు జిల్లా ల్లో గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ల నుంచి ఇసుకను తరలిస్తున్నారు. ఎక్కువగా హైదరాబాద్‌కు లారీల్లో ఇసుకను తరలివెళ్తోంది. అయితే ప్రభుత్వం నుంచి అనుమతులు పొంది ఇసుకను హైదరాబాద్‌కు తరలించకుండా సూర్యాపేట, నల్లగొండ, కోదాడ, హుజూర్‌నగర్, ఖమ్మంతో పాటు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

టన్ను రూ.1500 నుంచి రూ.2500 వరకు

వ్యాపారులుటన్ను ఇసుకను రూ.1500నుంచి రూ.2500 వరకు విక్రయిస్తున్నారు. భద్రాద్రి-కొత్తగూడెం, ములుగు జిల్లాల్లో అక్రమంగా డంప్ చేసిన ఇసుకను ఇతర జిల్లాలకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు ఇసుక తరలిస్తున్నారు. ఎక్కడైనా పోలీసులు, ఇతరశాఖల అధికారులు వాహనాలను ఆపి తనిఖీ చేస్తే ప్రభుత్వం నుం చి జారీచేసిన వేబిల్‌ను చూపుతూ తప్పించుకుంటున్నా రు. కానీ వేబిల్‌లో తేదీని పరిశీలించడం లేదు. ఒక వేళ పరిశీలించినా లారీ బ్రేక్ డౌన్ అయిందని అందుకే ఇసుకను నింపుకున్న తర్వాత నిర్ణీత సమయంలోపు వేబిల్‌లో పొందుపరిచిన ప్రాంతానికి చేరుకోలేకపోయామని నమ్మిస్తున్నారు. అంతేకాకుండా ఇసుక లోడ్‌తో వెళ్లాల్సిన లారీ చేరాల్సిన ప్రాంతానికి సరైన మార్గంలో కాకుండా అక్రమ మార్గంలో కూడా తీసుకెళ్తూ ఇసుకను విక్రయిస్తున్నారు.

తనిఖీల్లో పట్టుబడుతున్న ఇసుక లారీలు

అక్రమ మార్గంలో ఇసుక తరలిస్తున్న లారీలు ఇటీవల పోలీసులకు పట్టుబడుతున్నాయి. జిల్లాలోని మోతె, నేరేడుచర్ల పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇటీవల 10 లారీల వరకు పోలీసులు పట్టుకున్నారు. ఈ లారీల వద్ద వేబిల్ ఉన్నా అవి రెండు, మూడు రోజుల క్రితం జారీ చేసినవిగా ఉన్నాయి. అంతేకాక ఇసుకను ములుగు, కొత్తగూడెం జిల్లాల నుంచి హైదరాబాద్‌కు తరలించాల్సి ఉన్నా నేరేడుచర్ల, సూర్యాపేట, నల్లగొండ పట్టణాల్లో విక్రయించేందుకు ప్రయత్నించారు. అయితే పోలీసుల తనిఖీల్లో ఇసుక లారీలు పట్టుబడ్డాయి. వారి వద్ద ఉన్న వేబిల్స్‌ను అధికారులు పరిశీలించగా అసలు విషయం బహిర్గతమైంది. దీంతో పోలీసులు లారీలను స్టేషన్‌కు తరలించి కేసులు నమోదుచేశారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తే కేసులు



ఇసుకను అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేస్తాం. ఇసుకను తరలించే వాహనాలను సీజ్ చేస్తాం. కొందరు ఇసుక వ్యాపారులు ప్రభుత్వం నుంచి పొందిన వేబిల్‌ను అడ్డంపెట్టుకుని అక్రమ పద్ధతుల్లో ఇసుకను తరలిస్తున్నారు. అలాంటి వాటిని గమనించి క్షుణ్ణంగా తనిఖీలు చేసి కేసులు నమోదు చేస్తున్నాం. ఇటీవల ఇసుకను అక్రమ పద్ధతుల్లో తరలిస్తున్న లారీలను పట్టుకుని కేసులు నమోదు చేశాం. జిల్లాలో ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలించినా, డంప్ చేసినా చర్యలు తీసుకుంటాం.

కొత్తపల్లి నర్సింహ, ఎస్పీ సూర్యాపేట

ఆసక్తి తగ్గింది

(5వ పేజీ తరువాయి)

చేయాలని చివరి తేదీ వరకు వేచి ఉన్నారు. ఈ నెల 17వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 93 మద్యం దుకాణాలకు 1,274 దరఖాస్తులు రాగా చివరిరోజైన శనివారం 1373 దరఖాస్తులు వచ్చాయి. దీంతో జిల్లాలో మద్యం దరఖాస్తులు 2617 వచ్చాయి. గతంతో పోలిస్తే ప్రభుత్వానికి ఆదాయం తగ్గింది. 2023లో ప్రభుత్వానికి దరఖాస్తుల ద్వారా రూ. 87.76కోట్లు రాగా ఈసారి రూ. 78.51 కోట్లు వచ్చిం ది. ఇదిలా ఉండగా మద్యం దుకాణాలకు టెండర్లు దా ఖలు చేయాలని ఎక్సైజ్ అధికారులు వ్యాపారులకు, కొత్త వారికి మెసేజ్‌లు, ఫోన్‌కాల్స్ చేసి ప్రోత్సహించినా ఆశించిన మేర దరఖాస్తులు రాలేదు.

అత్యధికంగా దుకాణం నెంబరు 62

జిల్లా వ్యాప్తంగా 93 మద్యం దుకాణాలకు 2617 దరఖాస్తులు కాగా అత్యధికంగా చిలుకూరు మండలంలోని షాప్ నెంబరు 62కు 57 దరఖాస్తులు వచ్చాయి. అత్యల్పంగా తిరుమలగిరి పట్టణ పరిధిలోని దుకాణం నెంబరు 36కు 15 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి.

ముగిసిన దరఖాస్తుల స్వీకరణ

జిల్లాలోని 93 మద్యం దుకాణాలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ముగిసింది. 93 మద్యం దుకాణాలకు 2,500లకు పైగా వచ్చాయి. పారదర్శకంగా మద్యం దుకాణాలకు రిజర్వేషన్ కేటాయించాం. మద్యం దుకాణాల కేటాయింపులకు సంబంధించి ఈ నెల 23న లక్కీ డ్రా నిర్వహించి కేటాయింపులు చేయనున్నాం.

లక్ష్మానాయక్, ఈఎస్, సూర్యాపేట.

పక్వానికి వచ్చిన వరిని మాత్రమే నూర్పిడి చేయాలి

నాగారం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పక్వానికి వచ్చి పూర్తిగా గింజలు ఎర్ర బారిన వరిని మాత్రమే నూర్పిడి చేయాలని తహసీల్దార్ హరి కిషోర్ శర్మ సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం హార్వెస్టర్ యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వరికోత సమయంలో హార్వెస్టర్ నడిపే విధానం, ఆర్‌పీఎం 18 నుంచి 20 ఉంచాలని, బ్లోయర్ రన్ అయ్యే విధంగా చూడాలన్నారు. తాలూ మట్టి పెల్లలు రాకుండా జల్లెడను, ఫ్యాన్ ప్రతిరోజు శుభ్రపరచాలని ఏవో కృష్ణకాంత్ సూచించారు. వరి పంట కోతకు రాకముందే హార్వెస్టింగ్ చేయకూడదని, రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో కె. మారయ్య, ఎస్ఐ యాకుబ్, ఏపీఎంవెంకన్న, హార్వెస్టర్ మిషన్ యాజమానుల మండల అధ్యక్షుడు నర్సింగ వెంకన్న, మంగదుడ్ల దశరథ, తరాల ఆంజనేయులు, కోడి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠాశాల ముందు ఇలా.. విద్యార్థులు వెళ్లేదెలా



మాచనపల్లి ప్రాథమికోన్నత పాఠశాల గేటు వద్ద నిలిచిన వర్షం నీరు

నూతనకల్ మండలంలోని మాచనపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు వర్షం వస్తే వెళ్లడం కష్టంగా మారింది. పాఠశాల గేటు వద్ద మోకాళ్ల లోతు నీరు నిలుస్తున్నాయి. దీంతో విద్యార్థులు పాఠశాల లోపలికి వెళ్లాలంటే ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా ఇదే పాఠ శాల లో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. వాళ్లు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి-నూతనకల్)

కస్తూర్బా పాఠశాలలో మాక్ పోలింగ్

తుంగతుర్తి, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కలిగి ఉండాలనే ఉద్దేశంతో స్థానిక కస్తూర్బా ఉన్నత పాఠశాలలో ఎస్ఓ కల్పన మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికలను ఎలా నిర్వహిస్తారో ప్రజలు ఓటు హక్కును ఎలా వినియోగించుకుంటారో అనే విషయాన్ని పిల్లలే స్వయంగా అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు చేశారు. ప్రచారం నిర్వహించారు. విద్యార్థులు లైన్‌లో నిలబడి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం పాఠశాల సిబ్బంది ఓట్లను లెక్కించి విజేతను నిర్ణయించారు. పాఠశాల ప్రత్యేక అధికారిని కల్పన ఎన్నికల అధికారిగా, ఉపాధ్యాయులు ఎన్నికల సిబ్బందింగా విధులు నిర్వహించారు.



తుంగతుర్తి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఓటు వేయడానికి బారులుదీరిన విద్యార్థినులు

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

మునగాల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రభు త్వ ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సరిత సూచించారు.. శనివారం మండల కేంద్రం, మొద్దుల చెరువు సమీపంలో ఏర్పాటు చేసిన ఐకేపీ కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్‌దీన్‌దయాళ్, ఏవో రాజు, కొప్పుల జైపాల్‌రెడ్డి, మా ర్కెట్ కమిటీ డైరెక్టర్ కాసర్ల కోటేశ్వరావు, ఉప్పుల జానికిరెడ్డి, కొమ్ము ఈదారావు, కాసర్ల శ్రీను, బసవయ్య, సామేల్, మట్టయ్య, బసవయ్య, శ్రీనివాస్‌రావు, ఓరుగంటి రవి తదితరులు పాల్గొన్నారు.


● మోతె : మండలంలోని నామవరం, సిరికొండ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిరికొండ సహకార సొసైటీ ఛైర్మన్ కొండపల్లి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు నిర్వాహకులు రైతులను ఇబ్బందులు పెట్టకుండా త్వరితగతిన కాంటాలు వేయాలన్నారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న గిట్టుబాటు ధర మద్దతు ఈ కేంద్రాల్లోనే అందుతాయన్నారు. కార్యక్రమంలో సీఈవో బాణాల అనంత్‌రెడ్డి, సొసైటీ నిర్వాహకులు, ఏఈవో ప్రియాంక, కాంగ్రెస్ మం డల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, డైరెక్టర్లు పందిరి వెంకట్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

● చిలుకూరు : నిబంధనల ప్రకారం ధాన్యం తెచ్చి మద్దతు ధర పొందాలని మఠంపల్లి తహసీల్దార్ ధృవకుమార్, సహకార సంఘం ఛైర్మన్ బజ్జూరి రవీందర్ రెడ్డి సూచించారు.బేతవోలు గ్రా మంలో శనివారం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సీఈవో పాషా, ఆర్ఐ సీతరామచందర్‌రావు, కార్యదర్శి పూలశ్రీను, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

చిలుకూరులో డీసీసీబీ ఏర్పాటు హర్షణీయం

చిలుకూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) :చిలుకూరు మండల కేంద్రంలో డీసీసీబీ బ్యాంకు రావడం హర్షణీయమని డీసీసీబీ డైరెక్టర్ కొండా సైదులు, ఫ్యాక్స్ ఛైర్మన్ అలసకాని జనార్ధన్‌లు అన్నారు. శనివారం ప్రాథమిక సహకార సంఘంలో జరిగిన డైరెక్టర్ల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు.డీసీసీబీ బ్యాంక్ ఏర్పాటుకు ఆర్‌బీఐ అనుమతితో బ్యాంక్ రావడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం డైరెక్టర్లు, రైతులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 29.0
కనిష్ఠం 23.4
***
ANDHRAJYOTHY


సూర్యాపేట
5
ఆదివారం 19 అక్టోబరు 2025

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	588.70 (308.1702)	53,035	53,035
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.40 (4.30)	2,034.36	1,663.85
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.882 (44.0352)	30,548	37,760

ప్రాజెక్టుల నీటిమట్టం

చికెన్ ధరలు | లైవ్ : రూ.145 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250


దరఖాస్తులు అందజేస్తున్న వ్యాపారులు

జిల్లాలో మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు వ్యాపారులు ఈ పర్యాయం పెద్దగా ఆసక్తి చూపించలేదు. గతంలో మాదిరే దరఖాస్తులతో ఆదాయాన్ని రాబట్టుకునేందుకు దరఖాస్తు ఖరీదును రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచింది. అయితే 2023లో 4,388 దరఖాస్తులు రాగా ఈ పర్యాయం 2,617 దరఖాస్తులు వచ్చాయి. గతంలో కన్నా 1,771 దరఖాస్తులు తక్కువగా వచ్చాయి. అదేవిధంగా గతంలో దరఖాస్తులతో రూ.87.76 కోట్ల ఆదాయం రాగా ఈ సారి రూ.78.51 కోట్లు వచ్చింది. గతంలో కన్నా రూ.9.25 కోట్ల ఆదాయం తగ్గింది.

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట (క్రైం)

ఆసక్తి తగ్గింది

- ముగిసిన మద్యం దుకాణాల టెండర్ల దాఖలు
- ఆశించిన మేర ముందుకురాని వ్యాపారులు
- జిల్లాలో ప్రస్తుతం 93 మద్యం దుకాణాలు
- గతంలో 4,388 దరఖాస్తులు రాగా ఈ సారి 2617లకే పరిమితం
- ఈ నెల 23న దుకాణాల కేటాయింపునకు లక్కీడ్రా



జిల్లాలోని 99 మద్యం దుకాణాలు ఉండగా సరైన విక్రయాలు లేని కారణంతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి జిల్లా సరిహద్దులో ఉన్న ఆరు దుకాణాలతో పాటు చిలుకూరు మండలంలోని ఒక దుకాణాన్ని ఈసారి నోటిఫికేషన్‌లో తొలగించారు. సూర్యాపేట ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలోని ఆత్మకూర్(ఎస్) మండలంలో ప్రస్తుతం ఉన్న దుకాణాలకు అదనంగా మరో దుకాణాన్ని ఏర్పాటు చేశారు. దీంతో మొత్తం 93 దుకాణాలకు 40 దుకాణాలు రిజర్వేషన్ కాగా మిగిలిన 53 దుకాణాలు జనరల్‌కు కేటాయించారు. మూడు ఎస్టీలకు, 10 ఎస్సీలకు, 27 గౌడ కులస్తులకు కేటాయించారు. దుకాణాల కేటాయింపులకు పాత నిబంధనలనే వర్తింపజేశారు. లైసెన్స్ ఫీజులను గతంలో మాదిరే ఆరు స్లాబుల్లో చెల్లించే నిబంధనలను, అంతేకాకుండా లైసెన్స్ కాలపరిమితి కూడా రెండేళ్లు అలానే కొనసాగించారు.

ముందస్తు ఆదాయం కోసం

బీఆర్ఎస్ ప్రభుత్వం 2023లో ముందస్తుగా మద్యం దుకాణాలకు టెండర్లు నిర్వహించి ఆదాయాన్ని సమకూర్చుకుంది. ఆగస్టు 21 దుకాణాలకు లక్కీ డ్రా తీయగా, అనంతరం డిసెంబరు ఒకటో తేదీ నుంచి దుకాణాల ప్రారంభించారు. ఈసారి కూడా ముందుగా ఈ ఏడాది సెప్టెంబరు 25 నుంచి ఈ నెల 18 వరకు దరఖాస్తులు స్వీకరించారు. ఈ నెల 23న డ్రా తీసి మద్యం దుకాణాలను కేటాయించనున్నారు. 2023లో జిల్లావ్యాప్తంగా 99 మద్యం దుకాణాలకు 4,388 దరఖాస్తులు వచ్చాయి. ఈసారి 93 దుకాణాలకు గాను 2,617 దరఖాస్తులు వచ్చాయి

ముందుకు రాని వ్యాపారులు

ఈ సారి మద్యం దుకాణాలకు దరఖాస్తులు చేసేందుకు వ్యాపారులు ముందుకు రాలేదు. ఒక్కో దరఖాస్తు ఫీజును రూ.3 లక్షలు చేయడంతో వ్యాపారులు తక్కువ మొత్తంలో దరఖాస్తు చేశారు. దీనికి తోడు లైసెన్సు ఫీజు చెల్లించి రెండు నెలలు వేచిఉండాల్సి రావడంతో ఆయా డబ్బుకు వడ్డీ భారం తప్పడం లేదు. ప్రభుత్వం మద్యం వ్యాపారులకు ఇచ్చే లాభాలు మాత్రం పెంచలేదు. దీంతో దరఖాస్తు చేసేందుకు వ్యాపారులు పెద్దగా ఆసక్తి చూపలేదు. కొంతమంది మాత్రం సిండికేట్‌గా ఏర్పడి విడి విడిగా కాకుండా గ్రూపులుగా మద్యం దుకాణాలకు టెండర్లు దాఖలు చేశారు. దసరా పండుగ తర్వాత నుంచి దరఖాస్తులు చేసేందుకు ఆసక్తి చూపారు. అంతేకాకుండా ఇటీవల ఈ నెల 9న ఎన్నికల నోటిఫికేషన్ కూడా ఉండడం, కోర్టు తీర్పు ఈనెల 8న ఉండడంతో అవి ముగిసిన అనంతరం దరఖాస్తులు...

-మిగతా 8వ పేజీలో...

బంద్ విజయవంతం

- అన్ని మండల కేంద్రాల్లో ర్యాలీలు, ధర్నాలు


కోదాడలో అఖిల పక్షం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

కోదాడటౌన్/కోదాడ రూరల్/హుజూర్‌నగర్ అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడాన్ని నిరసిస్తూ బీసీ సంఘాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన బంద్ కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో విజయవంతమైంది. కోదాడలో కాంగ్రెస్, బీసీ, భారత రాష్ట్రపతి సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్, న్యూడెమోక్రసీ పార్టీలతో పాటు ఎమ్మార్పీఎస్ మాల మహానాడు, గిరిజన మైనార్టీ విద్యార్థి ప్రజా సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. బంద్‌లో బీఆర్ఎస్ అనంతగిరి మండల అధ్యక్షుడు నల్ల భూపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గుగులోతు శ్రీనివాస్, బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు ఆఫ్జల్ , పందిరి వీరయ్య, మోజేష్, భూక్యా బోస్ పాల్గొన్నారు. కోదాడ పట్టణంలోని ఆర్టీసీ బస్సులు డిపోకే పరిమితమయ్యాయి. బంద్ సందర్భంగా ఉదయం నుంచే రాజకీయపక్షాల నాయకులు డిపో ముందు పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. హుజూర్‌నగర్‌కార్యక్రమంలో శ్రీనివాసు, తన్నీరు మల్లికార్జున్‌రావు, అజీజ్‌పాషా, సాముల శివారెడ్డి, కంబాల శ్రీనివాసు, మల్లయ్య, నాగసైదులు, గల్లా వెంకటేశ్వర్లు, వెంకటచంద్ర, ఉపేందర్, రమేష్, దిల్లు, బెంజిమెన్, హుస్సేన్, రాంబాబు, వెంకటేశ్వర్లు, శివరామ్‌యాదవ్ పాల్గొన్నారు.

● మఠంపల్లి/మేళ్లచెర్వు/చింతలపాలెంలో: కాంగ్రెస్, బీఆర్ఎస్, టీడీపీ, సీపీఎం, కుల సంఘాలు, సీపీఐ నాయకులు బంద్‌లో పాల్గొన్నారు. మఠంపల్లి-మట్టపల్లి ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ముత్యాలు, రాధాకృష్ణ, మరియన్న పాల్గొన్నారు.

● చిలుకూరు :మండల కేంద్రంలోనిబ్యాంకులు, దుకాణాలు బంద్ చేయించారు. కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారిపై అఖిలపక్ష ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

● నేరేడుచర్ల : బీసీ హక్కుల సాధన సమితి, కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం, సీపీఐ, సీపీఐఎంఎల్ మాస్‌లైన్, జనసేన, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు. స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేశారు. అనంతరం ప్రధాన కూడలి వద్ద వేరువేరుగా రాజకీయ ప్రతినిధులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో కొణతం చిన వెంకటరెడ్డి, ధూళిపాళ ధనుంజయనాయుడు, పారేపల్లి శేఖర్‌రావు, రాపోలు నవీన్‌కుమార్, కొణతం నాగిరెడ్డి, సందీప్‌రెడ్డి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : డీఎంహెచ్‌వో

మునగాల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. వ్యాక్సిన్ నమోదు రికార్డులను పరిశీలించారు. కొక్కిరేణి గ్రామ వ్యాక్సిన్ రికార్డు తప్పుల తడకగా ఉండటంతో వైద్య సిబ్బంది పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట వైద్యాధికారులు పి రవీందర్, స్రవంతి, వైద్య సిబ్బంది ఉన్నారు.


మునగాలలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

సురేష్ మృతి బీఆర్ఎస్‌కు తీరని లోటు

చిలుకూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు దొడ్డా సురేష్ ఆకాల మృతి బీఆర్ఎస్‌కు తీరని లోటనిమాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సురేష్ సంతాప సభలో ఆయన మాట్లాడారు. ఆయన ఆశయసాధనకు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా సురేష్ చిత్రపటానికి పలు వురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు జానకిరామాచారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వివిధ పార్టీ నాయకులు, ఉద్యోగ సంఘాల, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కోదాడ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలి



సూర్యాపేట సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట(కలెక్టరేట్), అక్టోబరు 18, (ఆంధ్రజ్యోతి): కోదాడ మునిసిపాలిటీ అమృత్ 2.0 పథకానికి ఎంపికైనందున పట్టణాభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సంబంధింత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం కోదాడ పట్టణాభివృద్ధిపై వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కోదాడ పట్టణంలో భవిష్యత్‌లో పెరుగనున్న జనాభాకనుగుణంగా అన్ని మౌలిక వసతులు కల్పించే విధంగా మాస్టర్ ప్లాన్ తయారు చేయాలన్నారు. రోడ్లు, డ్రైయినేజీ, తాగునీరు, విద్యావ్యవస్థ, ఇరిగేషన్, విద్యుత్ వ్యవస్థలు అభివృద్ధి చెందే విధంగా ప్లాన్ తయారు చేయాలన్నారు. అర్బన్ డెవలప్‌మెంట్ ప్లాన్ సరిగా లేకపోతే ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కొలనుపాక సీతారామారావు, ఆర్డీవో సూర్యనారాయణ, డీటీసీపీ ప్రాజెక్టు డైరెక్టర్ అశ్విని, కోదాడ మునిసిపల్ కమీషనర్ రమాదేవి, సీపీవో కిషన్, డీఎఫ్‌వో సతీష్‌కుమార్, పరిశ్రమల శాఖ అధికారి సీతారాంనాయక్, మునిసిపల్ డీఈ సాయిలక్ష్మి, టీపీవో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పశు సంపదను కాపాడాలి

చిలుకూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పశు సంపదను కాపాడాలని జిల్లా పశువైద్యాధికారి శ్రీనివా సరావు అన్నారు. మండలంలోని సీతారాంపురం ఉపకేంద్రంలో జరుగుతున్న గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమం శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీకా కార్యక్రమాన్ని 100శాతం పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి వీరారెడ్డి, సిబ్బంది వెంకటేశ్వర్లు, నీంజ పాల్గొన్నారు.

ఈ దీపావళి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి

కోదాడటౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : దీపావళి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఎస్ఆర్ఎం విద్యాసంస్థల కరస్పాండెంట్ కేశినేని శ్రీదేవి అన్నారు. స్థానిక బాలాజీ నగర్ ఎస్ఆర్ఎం స్కూల్‌లో శనివారం ముందస్తు దీపావళి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా దీపావళి విశిష్టత గురించి ఆమె వివరించారు. తూర్పు భారతదేశంలో కాళికామాత రక్తబీరుని చంపిన సందర్భంగా దీపావళి చేసుకుంటారని ఉత్తర పశ్చిమ భారతదేశంలో రావణుని చంపి శ్రీరాముడు అయోధ్య నగరానికి తిరిగి వచ్చిన సందర్భంగా దీపావళి జరుపుకుంటారని, దక్షిణ భారతదేశంలో సత్యభామ నరకాసురుని చంపి సందర్భాన్ని దీపావళి చేసుకుంటారని ఆమె అన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కాళికామాత వేషధారణలో ఎస్ఆర్ఎం పాఠశాల వేషధారణలో విద్యార్థులు

విద్యార్థులు స్నేహభావం అలవర్చుకోవాలి

కోదాడటౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు స్నేహసంబంధాలు అలవర్చుకోవాల ని విజన్ కళాశాల కరస్పాండెంట్ జి. సైదయ్య అన్నారు. శుక్రవారం ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు వెలకమ్ పార్టీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ స్నేహానికి ఉన్న గొప్పదనాన్ని వివరించారు. మీరందరూ ఇక్కడ ఏర్పడిన స్నేహాన్ని జీవితాంతం కొనసాగించాలని కోరారు. విద్యార్థులను ఉద్దేశించి చిన్న, చిన్న కథలతో వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించారు. ప్రతి డైరెక్టర్ తమ శైలిలో విద్యార్థులకు హితబోధ చేశారు. అనంతరం విద్యార్థులకు ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సైదయ్య, వైస్ ప్రిన్సిపాల్ అంజత్‌సైదిరెడ్డి, సీతారాం, సాధిక్ అతిథులుగా కేఎల్‌రావు, మధు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కళాశాల కరస్పాండెంట్ జి. సైదయ్య

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే బీసీలకు అన్యాయం

హుజూర్‌నగర్ , అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే బీసీలకు అన్యాయం జరిగిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మండవ వెంకటేశ్వర్లుగౌడ్ అన్నారు. పట్టణంలో శనివారం టీడీపీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ తెలంగాణలోని అఖిలపక్ష పార్టీల నాయకులను తీసుకెళ్లి మోదీ వద్దకు తీసుకెళ్లాలన్నారు.. రాజకీయ లబ్ధికోసమే రిజర్వేషన్లు అడ్డుకుంటున్నారన్నారు. సమావేశంలో జక్కుల కిరణ్‌యాదవ్, బానోత్ వెంకట్రామ్‌నాయక్, పిల్లుట్ల లింగయ్య, అంజయ్య, సైదానాయక్, వెంకన్న, నజీర్, వంశీ పాల్గొన్నారు.

శివరాం కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

మఠంపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలో శనివారం మృతి చెందిన భవన నిర్మాణ కార్మికుడు గండికోట శివరాం కుమార్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని సీఐటీయూ నాయకులు కోరారు. శనివారం శివరాం మృతదేహాన్ని పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పలువురు సంఘం నాయకులు పరామర్శించారు. భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవడంలో పాలక ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యారని, శివరాం కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నివాళులర్పించిన వారిలో సీఐటీయూ జిల్లా నాయకులు సయ్యద్ రన్‌మియా, నాగలక్ష్మి, కాంతమ్మ, నాగరాజు, నిర్మల, మంగ, వెంకటమ్మ, వీరమ్మ, సైదమ్మ, రోజా, రాణి తదితరులు ఉన్నారు.

పాఠాలతోపాటు, వ్యక్తిగత నైపుణ్యం

ఎస్‌ఆర్‌ఎం లక్ష్యం


ఎస్ఆర్ఎం పాఠశాల

కోదాడ, అక్టోబరు 18 : భవిష్యత్ ప్రపంచానికి సిద్ధమైన గ్లోబల్ సిటిజన్లను తీర్చిదిద్దే ఆధునిక పాఠశాల ఎస్ఆర్ఎం. ఎస్ఆర్ఎంలో సంకల్పంతో విద్య అంటే పాఠాలు మాత్రమేకాదు, జీవితానికి కావలసిన ప్రతి నైపుణ్యాన్ని నేర్పించడమే లక్ష్యం. అంతర్జాతీయ స్థాయి సమగ్ర విద్యావిధానం(హోలోస్టిక్ ఆల్ రౌండ్ డెవలప్‌మెంట్), కంప్యూటర్ అండ్ ఏఐ ఎడ్యుకేషన్, ప్రోగ్రామింగ్ నుంచి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వరకు విశ్లేషణలు, స్పార్క్ ఇంగ్లీషు, ప్రోగ్రామ్, కంప్యూటర్ వినిపించే వాయిస్ అసిస్టెంట్ విని నేర్చుకోవటం, తాము చదివితే ఏఐ వారి ఉచ్చారణ అండ్ స్లాగ్‌ని వెంటనే సరిచేస్తుంది. ప్రతి ఒక్కరూ తమ స్థాయికి అనుకూలంగా అభివృద్ధి చెందుతారు. సూర్యాపేట జిల్లాలో ఎస్ఆర్ఎంలోనే ప్రత్యేకంగా అందుబాటులో ఉంది. రోబోటిక్ అండ్ త్రీడీ టెక్నాలజీ లాబ్, మెషీన్ ప్రోగ్రామింగ్, వంటి ప్రాక్టికల్ జ్ఞానం. ఆరవతరగతి నుంచే ఐఐటీ ఫౌండేషన్, డాక్టర్స్, నీట్ గ్రాడ్యుయేట్స్‌ను తయారుచేసిన ప్రతిభా పాఠశాల, నేషనల్ ఒలంపియాడ్ లెవల్ ట్రైనింగ్ ఇవ్వటం పాఠశాల ప్రత్యేకత. కళలు, భారతీయ సంస్కృతితో సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం, ప్రైమరీ పిల్లల కోసం డ్రాయింగ్ అండ్ ఆర్ట్స్‌లో శిక్షణ, విద్యార్థులకు ఆరు నుంచే శాస్త్రీయ నృత్య శిక్షణ, ఒకల్ మ్యూజిక్(పాడటం శిక్షణ), పియానో, కీబోర్డ్, రిథమ్ పాడ్స్‌వంటి వాటిలో నిపుణులతో బోధన, ఎస్ఎస్‌సీ ఫలితాల్లో టౌన్ టాప్ ఎన్నో సార్లు సాధించటం పాఠశాల ప్రత్యేకత. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉండడం, అదే విధంగా 20ఏళ్ల అనుభవం కలిగిన కేశినేని శ్రీదేవి ఆధ్వర్యంలో విజయపథంలో నడిచే పాఠశాల. 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు ప్రారంభంకాగా సీట్లు పరిమితంగా ఉన్నాయి. అంతేగాక జిల్లాలోనే ఒక్క ఎస్ఆర్ఎం స్కూల్‌తోపాటు, సంకల్ప క్యాంపస్‌లో అకడమిక్స్, ఏఐ, ఆర్ట్స్, కల్చరల్, స్పోర్ట్స్ ఉన్నాయి.

ADVT

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


మునగాలలో ఐకేపీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ సరిత

మునగాల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సరిత సూచించారు.. శనివారం మండల కేంద్రం, మొద్దుల చెరువు సమీపంలో ఏర్పాటు చేసిన ఐకేపీ కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్‌దీన్‌దయాళ్, ఏవో రాజు, కొప్పుల జైపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాసర్ల కోటేశ్వరావు, ఉప్పుల జానికిరెడ్డి, కొమ్ము ఈదారావు, కాసర్ల శ్రీను, బసవయ్య, సామేల్, మట్టయ్య, బసవయ్య, శ్రీనివాస్‌రావు, ఓరుగంటి రవి తదితరులు పాల్గొన్నారు.

● మోతె : మండలంలోని నామవరం, సిరికొండ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిరికొండ సహకార సొసైటీ చైర్మన్ కొండపల్లి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు నిర్వాహకులు రైతులను ఇబ్బందులు పెట్టకుండా త్వరితగతిన కాంటాలు వేయాలన్నారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న గిట్టుబాటు ధర మద్దతు ఈ కేంద్రాల్లోనే అందుతాయన్నారు. కార్యక్రమంలో సీఈవో బాణాల అనంత్‌రెడ్డి, సొసైటీ నిర్వాహకులు, ఏఈవో ప్రియాంక, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, డైరెక్టర్లు పందిరి వెంకట్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

● చిలుకూరు : నిబంధనల ప్రకారం ధాన్యం తెచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని మఠంపల్లి తహసీల్దార్ ధ్రువకుమార్, సహకార సంఘం చైర్మన్ బజ్జూరి రవీందర్‌రెడ్డి సూచించారు. మండలంలోని బేతవోలు గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. రైతులు ఆరుకాలం కష్టంచి పండించిన ధాన్యాన్ని దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వం కల్పించి కొనుగోలు కేంద్రాలలో విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో సీఈవో పాషా, ఆర్ఐ సీతరామచందర్‌రావు, కార్యదర్శి పూలశ్రీను, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

చిలుకూరులో డీసీసీబీ ఏర్పాటు హర్షణీయం

చిలుకూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) :చిలుకూరు మండల కేంద్రంలో డీసీసీబీ బ్యాంకు రావడం హర్షణీయమని డీసీసీబీ డైరెక్టర్ కొండా సైదులు, ప్యాక్స్ చైర్మన్ ఆలసకాని జనార్దన్ అన్నారు. శనివారం ప్రాథమిక సహకార సంఘంలో నిర్వహించిన డైరెక్టర్ల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం డైరెక్టర్లు, రైతులు, సభ్యులు పాల్గొన్నారు.

వికాస తరంగిణి ఆధ్వర్యంలో విష్ణు సహస్రనామ పారాయణం

హుజూర్‌నగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : హుజూర్‌నగర్ పట్టణంలో శనివారం త్రిదండి చిన్నజీయర్ స్వామి తిరునక్షత్రం సందర్భంగా వికాసతరంగిణి ఆధ్వర్యంలో విష్ణు సహస్రనామ పారాయణ, పంచాయుధ స్తోత్ర పారాయణం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అట్లూరి మంజులహరిబాబు, కొత్తా కళావతి, మాధవి, పద్మ, భారత్మ, ఆరేటి లక్ష్మీ, ఇందిర, పిచ్చమ్మ, విజయ, శిరీష, రాధిక, గిరిజ, సుగుణ పాల్గొన్నారు.

ఆసక్తి తగ్గింది

(5వపేజీ తరువాయి) వేచి ఉన్నారు. ఈ నెల 17వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 93 మద్యం దుకాణాలకు 1,274 దరఖాస్తులు రాగా చివరిరోజైన శనివారం 1373 దరఖాస్తులు వచ్చాయి. దీంతో జిల్లాలో మద్యం దరఖాస్తులు 2617 వచ్చాయి. గతంతో పోలిస్తే ప్రభుత్వానికి ఆదాయం తగ్గింది. 2023లో ప్రభుత్వానికి దరఖాస్తుల ద్వారా రూ.87.76కోట్లు రాగా ఈసారి రూ.78.51 కోట్లు వచ్చింది. ఇదిలా ఉండగా మద్యం దుకాణాలకు టెండర్లు దాఖలు చేయాలని ఎక్సైజ్ అధికారులు వ్యాపారులకు, కొత్త వారికి మెసేజ్‌లు, ఫోన్‌కాల్స్ చేసి ప్రోత్సహించినాఆశించిన మేర దరఖాస్తులు రాలేదు.

అత్యధికంగా దుకాణం నెంబరు 62కు

జిల్లా వ్యాప్తంగా 93 మద్యం దుకాణాలకు 2617 దరఖాస్తులు కాగా అత్యధికంగా చిలుకూరు మండలంలోని షాప్ నెంబరు 62కు 57 దరఖాస్తులు వచ్చాయి. అత్యల్పంగా తిరుమలగిరి పట్టణ పరిధిలోని దుకాణం నెంబరు 36కు 15 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి.

ముగిసిన దరఖాస్తుల స్వీకరణ

జిల్లాలోని 93 మద్యం దుకాణాలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ముగిసింది. 93 మద్యం దుకాణాలకు 2,500లకు పైగా వచ్చాయి. పారదర్శకంగా మద్యం దుకాణాలకు రిజర్వేషన్ కేటాయించాం.

-లక్ష్మానాయక్, ఈఎస్, సూర్యాపేట.